TGTEL/26/A7716

ఉద్యమ పోరు

UDYAMA PORU

ప్రతి పదం.. పోరాట కదం..

వరంగల్ | సంపుటి : 1 | సంచిక : 30 | శనివారం | 17.10.2026 | పేజీలు : 8 | వెల : 3 /- | ఎడిటర్ - బండారి సుమంత్

ఇది కాంగ్రెస్ చేతగానితనం వల్ల వచ్చిన కరవు.. - కేటీఆర్

- తెలంగాణలో నీటి ఎద్దడికి కాంగ్రెస్ నిర్లక్ష్యమే కారణమని కేటీఆర్ ఆరోపణ
- 1,000 టీఎంసీల గోదావరి, కృష్ణా జలాలు వృథాగా దిగువకు వెళ్లాయని వ్యాఖ్య
- కన్నెపల్లి, దేవాదుల పంపులను సక్రమంగా వినియోగించలేదని విమర్శ

» 2

దసరా రద్దీ దృష్ట్యా 7 వేల ప్రత్యేక బస్సులు

- తెలంగాణ ఆర్టీసీ ఎండీ

- రేపటి నుంచి ఈ నెల 19వ తేదీ వరకు అదనపు బస్సులు
- పండుగ అనంతరం రద్దీ దృష్ట్యా ప్రత్యేక సర్వీసులు సిద్ధం చేసినట్లు వెల్లడి
- ప్రత్యేక సర్వీసుల వివరాల కోసం టోల్ ఫ్రీ నెంబర్లలో సంప్రదించాలని సూచన

» 2

తెలంగాణలో హ్యుందాయ్ మెగా పెట్టుబడి

- జహీరాబాద్ నిమ్జ్ లో రూ. 8,528 కోట్లతో గ్లోబల్ ఆర్ అండ్ డీ కేంద్రం
- రానున్న రోజుల్లో 4,276 మందికి ఉద్యోగావకాశాలు
- కార్ల తయారీ పరిశ్రమ స్థాపనకు సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానం
- తెలంగాణ అభివృద్ధిలో కొనసాగనున్న హ్యుందాయ్ భాగస్వామ్యం

ఉద్యమ పోరు, హైదరాబాద్ : కార్ల తయారీ పరిశ్రమ స్థాపనకు హైదరాబాద్ అత్యంత అనువైన ప్రాంతమని, రాష్ట్రంలో మాన్యుఫ్యాక్చరింగ్ రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఎంసీఆర్ హెచ్ఆర్డీ బోధి పెవిలియన్‌లో హ్యుందాయ్ మోటార్స్ ఇండియా ఇంజినీరింగ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ చాంగ్యోన్ చో నేతృత్వంలోని ప్రతినిధి బృందంతో ఆయన సమావేశమయ్యారు. భౌగోళికంగా దేశం మధ్యలో ఉన్న హైదరాబాద్ కాస్మోపాలిటన్, సురక్షితమైన జీవన ప్రమాణాలు కలిగిన నగరమని పేర్కొన్న సీఎం, సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లోని నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ జోన్ లో 678 ఎకరాల్లో రూ. 8,528 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న గ్లోబల్ ఆర్ అండ్ డీ, భారీ వాహన పరీక్షా కేంద్రానికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. 2024 ప్రపంచ ఆర్థిక సదస్సులో జరిగిన చర్చల ఫలితంగా, 2025 జూన్‌లో కేబినెట్ ఉపసంఘం ఆమోదం పొందిన ఈ ప్రాజెక్ట్ ద్వారా మొత్తం 4,276 ఉద్యోగాలు లభించనున్నాయని, రానున్న కొన్ని నెలల్లో శంకుస్థాపన చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని హ్యుందాయ్ ప్రతినిధులు తెలిపారు. ప్రత్యేక మొబిలిటీ క్లస్టర్లు, పెరి-అర్బన్ రీజియన్ అభివృద్ధి, ఫ్యూచర్ సిటీ ప్రణాళికలను వివరించిన ముఖ్యమంత్రి, 2026లో జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు వారిని ఆహ్వానించగా, రాష్ట్ర ప్రగతిలో తమ భాగస్వామ్యం కొనసాగుతుందని సంస్థ ప్రతినిధులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు కె. రామకృష్ణారావు, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ లు పాల్గొన్నారు.

మేడ్చల్‌లో నకిలీ రిజిస్ట్రేషన్ల దందా..

- ముగ్గురి అరెస్ట్

- నకిలీ యూఎల్‌సీ పత్రాలతో అక్రమ భూ రిజిస్ట్రేషన్లు
- మేడ్చల్ జిల్లాలో ముగ్గురు సభ్యుల ముఠా అరెస్ట్
- ఒక్కో రిజిస్ట్రేషన్‌కు రూ. 6 లక్షలు వసూలు
- నిందితుల నుంచి నకిలీ పత్రాలు, స్టాంప్ పేపర్లు స్వాధీనం
- జీడిమెట్ల పరిధిలో వెలుగు చూసిన మోసం

» 2

రాహుల్ తాటాకు చప్పుళ్లకు భయపడం

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

- కేంద్ర ప్రభుత్వాన్ని కూల్చేందుకు విపక్షాలు కుట్ర చేస్తున్నాయని ఆరోపణ
- పది నెలల్లో మోదీ సర్కార్ పడిపోతుందని దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శ
- 2029 వరకు మోదీ ప్రధానిగా ఉండాలని ప్రజలు తీర్పు ఇచ్చారని వ్యాఖ్య

వివరాలు 2 లో

అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయండి

- మోదీకి ఖర్గే లేఖ

- కొత్త బిల్లులపై చర్చ పెట్టాలని డిమాండ్
- గతంలో డీలిమిటేషన్ బిల్లు వీగిపోయిన వైనం ప్రస్తావన
- అఖిలపక్షం కోసం విజ్ఞప్తి చేయడం ఇది నాలుగోసారని వెల్లడి

» 2

రేవంత్ సన్నిహితులకు మెడికవర్‌లో వాటాలు

- మన్నె క్రిశాంక్

- మెడికవర్ వ్యవహారంలో సీఎం రేవంత్‌కు బీఆర్ఎస్ నేత క్రిశాంక్ సవాల్
- సీఎం కుటుంబ సన్నిహితులకు వాటాలున్నాయంటూ ముగ్గురి పేర్ల వెల్లడి
- రూ.13,200 కోట్ల డీల్‌పై సీబీఐ విచారణ జరపాలని డిమాండ్

» 2

వర్షంలోనూ తరగని భక్తి..

తిరుమలలో వైభవంగా శ్రీవారి గరుడ సేవ

- నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేడు గరుడ వాహన సేవ
- వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పోటెత్తిన లక్షలాది మంది భక్తులు
- లక్ష్మీకాసుల మాలతో గరుత్మంతునిపై దర్శనమిచ్చిన మలయప్ప స్వామి
- గోవింద నామస్మరణతో మార్మోగిన తిరుమల పురవీధులు

» 2

ఈ నెలలో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు..

- మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన బిల్లులపై కేంద్రం కసరత్తు!

- ఈ నెలలో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించే అవకాశం
- మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన బిల్లులపై కేంద్రం దృష్టి
- ఏప్రిల్ 17న లోక్‌సభలో వీగిపోయిన రాజ్యాంగ సవరణ బిల్లు

ఉద్యమ పోరు, న్యూ ఢిల్లీ : మహిళా రిజర్వేషన్లు, లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లులను ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ నెలలో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. లోక్‌సభలో ఈ బిల్లులను ఆమోదింపజేసేందుకు అవసరమైన మద్దతు తమకు ఉందని కేంద్రం ధీమాగా ఉన్నట్లు సమాచారం. మరోవైపు ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్), ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ అంశాలపై ప్రతిపక్షాల నిరసనలు కొనసాగుతున్నాయి. ప్రతిపాదిత బిల్లులకు మద్దతు కూడగట్టేందుకు కేంద్రం ప్రతిపక్ష పార్టీలతోనూ చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ఈ ఏడాది ఏప్రిల్ 17న బడ్జెట్ సమావేశాల సందర్భంగా నియోజకవర్గాల..

2

రాహుల్ తాటాకు చప్పుళ్లకు భయపడం

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

మొదటిపేజీ తరువాయి.. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు ప్రతిపక్షాలు కుట్రలు పన్నుతున్నాయని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి తీవ్రంగా ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలను ఆయన "తాటాకు చప్పుళ్లు"గా అభివర్ణించారు. ప్రజా తీర్పును గౌరవించకుండా, దేశంలో అరాచకాన్ని సృష్టించి ప్రభుత్వాన్ని కూలదోయాలని విపక్షాలు పగటి కలలు కంటున్నాయని ఆయన ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్య హక్కులను ప్రతిపక్షాలు దుర్వినియోగం చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. "పది నెలల్లో మోదీ ప్రభుత్వం కూలిపోతుంది" అంటూ కొన్ని పార్టీలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండించిన ఆయన, ఇది ప్రజాతీర్పును అవమానించడమేనని పేర్కొన్నారు. "ప్రధానిగా నరేంద్ర మోదీ 2029 వరకు కొనసాగాలని ప్రజలు స్పష్టమైన తీర్పునిచ్చారు. అయితే, బంగ్లాదేశ్, శ్రీలంక వంటి దేశాల్లో ప్రభుత్వాలను మార్చినట్లుగా ఇక్కడ కూడా చేయాలని ప్రతిపక్షాలు దింపుడుకల్లం ఆశలతో ఉన్నాయి. వారి ఆశలు ఎప్పటికీ నెరవేరవు" అని కిషన్‌రెడ్డి విమర్శించారు. ప్రపంచ దేశాలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నప్పటికీ, ప్రధాని మోదీ నాయకత్వంలో భారతదేశం స్థిరంగా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని ఆయన గుర్తుచేశారు. ప్రభుత్వ పనితీరును చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలు ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. రాహుల్ గాంధీ చేసే తాటాకు చప్పుళ్లకు మోదీ ప్రభుత్వం భయపడదని, తమ ప్రభుత్వం అత్యంత స్థిరంగా ఉందని, పూర్తికాలం కొనసాగుతుందని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.

అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయండి : మోదీకి ఖర్గే లేఖ

మొదటిపేజీ తరువాయి.. కొత్త బిల్లులు, కీలక ప్రతిపాదనలపై చర్చించేందుకు తక్షణమే అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ఈ ప్రతిపాదనలను పార్లమెంటులో ప్రవేశపెట్టడానికి ముందే వాటిపై సమగ్రంగా చర్చించాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కిచెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్ 17న నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్)కు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో మూడింట రెండొంతుల మెజారిటీ సాధించలేక వీగిపోయిన విషయాన్ని ఖర్గే తన లేఖలో గుర్తుచేశారు. దేశంపై తీవ్ర ప్రభావం చూపే ఇటువంటి రాజ్యాంగ సవరణ బిల్లులను మరోసారి పార్లమెంటులో ఏకపక్షంగా 'బుల్డోజ్' చేయవద్దని ప్రభుత్వానికి హితవు పలికారు. అఖిలపక్ష సమావేశం కోసం తాను విజ్ఞప్తి చేయడం ఇది నాలుగోసారి అని ఖర్గే తెలిపారు. గతంలో ఏప్రిల్ 11, జులై 16, ఆగస్టు 27 తేదీల్లో కూడా సమావేశం నిర్వహించాలని తాను కోరినట్లు ఆయన పేర్కొన్నారు. మరోవైపు, ఆగస్టు 13న వర్షాకాల సమావేశాలు వాయిదా పడిన 64 రోజుల తర్వాత కూడా ఉభయ సభలను ఇంకా ప్రొరోగ్ చేయలేదని, గతంలో ఎన్నడూ ఇలా జరగలేదని అని ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, 2026 ఏప్రిల్ 16న కేంద్ర న్యాయశాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ప్రవేశపెట్టిన రాజ్యాంగ (131వ సవరణ) బిల్లుతో పాటు మరో రెండు బిల్లులు మరుసటి రోజే తిరస్కరణకు గురైన సంగతి తెలిసిందే.

రేవంత్ సన్నిహితులకు మెడికవర్‌లో వాటాలు : మన్నె క్రిశాంక్

మొదటిపేజీ తరువాయి.. మెడికవర్ ఆసుపత్రి వ్యవహారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ బహిరంగ సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి కుటుంబానికి అత్యంత సన్నిహితులైన వ్యక్తులకు మెడికవర్ ఆసుపత్రితో పాటు ఇతర అనుబంధ సంస్థల్లో వాటాలు ఉన్నాయని ఆరోపిస్తూ, అందుకు సంబంధించిన ఆధారాలు తన వద్ద ఉన్నాయంటూ సోషల్ మీడియాలో ఒక వీడియోను విడుదల చేశారు. మెడికవర్‌లో తన కుటుంబానికి వాటాలున్నాయని నిరూపించాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేసిన నేపథ్యంలో క్రిశాంక్ ఈ వీడియోతో స్పందించారు. సీఎంకు సన్నిహితులంటూ ఆయన ముగ్గురి పేర్లను వెల్లడించారు. డుంపా శిరీష రెడ్డి, బ్రహ్మానంద రెడ్డి, అన్నం శరత్ రెడ్డిలకు మెడికవర్ ఆసుపత్రి, మ్యాక్స్‌బిన్ ఫార్మా, మైండ్‌వాల్ట్ సంస్థల్లో ఉన్న షేర్ల వివరాలను సంఖ్యలతో సహా వెల్లడించారు. ఈ సంబంధాలు స్పష్టంగా కనిపిస్తున్నా ముఖ్యమంత్రి ఎందుకు మౌనంగా ఉన్నారని ఆయన ప్రశ్నించారు. మెడికవర్ ఆసుపత్రిని రూ.13,200 కోట్లకు విక్రయించారని, ఈ లావాదేవీ ద్వారా నల్లధనాన్ని తెల్లధనంగా మార్చారని క్రిశాంక్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ వ్యవహారంపై తక్షణమే సీబీఐతో విచారణ జరిపించాలని, లేదంటే ఆ డబ్బును రాష్ట్రంలోని రైతులకు పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో ఇదే అంశంపై ఆరోపణలు చేసినందుకు మన్నె క్రిశాంక్‌ను పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. తాజా వీడియోతో ఈ వివాదం మరోసారి రాజకీయంగా వేడెక్కింది.

మేడ్చల్‌లో నకిలీ రిజిస్ట్రేషన్ల దందా.. ముగ్గురి అరెస్ట్

మొదటిపేజీ తరువాయి.. నకిలీ పత్రాలను సృష్టించి అక్రమ రీతిలో భూముల రిజిస్ట్రేషన్లకు పాల్పడుతున్న ఓ ముఠా గుట్టును మేడ్చల్ పోలీసులు రట్టు చేశారు. ఈ మోసానికి సంబంధించి ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసిన పోలీసులు, వారి వద్ద నుంచి కీలకమైన నకిలీ పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ పరిధిలోని జీడిమెట్ల ప్రాంతంలో ఈ అక్రమ ఉదంతం వెలుగులోకి వచ్చింది. నిందితులు ప్రధానంగా నకిలీ అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యూఎల్‌సీ) క్లియరెన్స్ పత్రాలను రూపొందించారు. వీటిని ఆధారంగా చేసుకుని జీడిమెట్ల ప్రాంతంలోని సర్వే నంబర్లు 192, 193లో గల భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేయించారు. ఒక్కో రిజిస్ట్రేషన్ ప్రక్రియకు నిందితులు సుమారు రూ.6 లక్షల మేర వసూలు చేసినట్లు పోలీసు విచారణలో వెల్లడైంది. ఇప్పటివరకు రెండు అక్రమ రిజిస్ట్రేషన్లను వీరు పూర్తి చేసినట్లు అధికారులు గుర్తించారు. ఈ భారీ మోసంపై సమాచారం అందుకున్న పోలీసులు తక్షణమే స్పందించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి నకిలీ యూఎల్‌సీ పత్రాలతో పాటు స్టాంప్ పేపర్లను స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్, దాని పరిసర ప్రాంతాలలో ఇటీవల భూ సంబంధిత అక్రమాలు పెరుగుతున్న తరుణంలో అధికారులు నిఘాను మరింత తీవ్రతరం చేశారు. ఈ ముఠా వెనుక ఇంకా ఎవరి హస్తమైనా ఉందా? వీరు గతంలో మరిన్ని మోసాలకు పాల్పడ్డారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు.

వర్షంలోనూ తరగని భక్తి.. తిరుమలలో వైభవంగా శ్రీవారి గరుడ సేవ

మొదటిపేజీ తరువాయి.. కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి వారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో అత్యంత ముఖ్యమైన గరుడ వాహన సేవ శుక్రవారం రాత్రి అత్యంత వైభవంగా, కన్నుల పండువగా జరిగింది. ఉత్సవాల్లో ఐదో రోజైన ఈ పర్వదినాన, స్వామివారికి అత్యంత ప్రీతిపాత్రుడైన గరుత్మంతునిపై మలయప్ప స్వామి వారు ప్రత్యేకమైన లక్ష్మి కాసుల హారంతో అలంకృతులై తిరుమాడ వీధుల్లో విహరించారు. భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా లక్షలాది మంది భక్తులు గోవింద నామస్మరణతో స్వామివారిని దర్శించుకుని భక్తి పారవశ్యంలో మునిగితేలారు. శుక్రవారం రాత్రి 6:30 గంటలకు వాహన సేవ ప్రారంభమైంది. గజరాజుల గంభీర నడకలు, మంగళవాయిద్యాలు, కళాకారుల భజనలు, కోలాటాలు, జీయంగార్ల వేద ఘోషల నడుమ గరుడ వాహనంపై శ్రీవారు ముందుకు కదిలారు. అడుగడుగునా భక్తులు కర్పూర హారతులు సమర్పిస్తూ "గోవిందా.. గోవిందా.." అంటూ చేసిన జయజయధ్వానాలతో సప్తగిరులు మార్మోగాయి. స్వామివారి దివ్యమంగళ స్వరూపాన్ని కనులారా వీక్షించిన భక్తులు తన్మయత్వం చెందారు. మధ్యాహ్నం నుంచి తిరుమలలో వర్షం కురుస్తున్నప్పటికీ భక్తుల ఉత్సాహం ఏమాత్రం తగ్గలేదు. చిరుజల్లులను సైతం లెక్కచేయకుండా గంటల తరబడి గ్యాలరీల్లో వేచి ఉండి, గరుత్మంతునిపై ఉన్న తమ ఆరాధ్య దైవాన్ని దర్శించుకున్నారు. వర్షంలో వేచి ఉన్న భక్తులకు టీటీడీ అధికారులు అన్నప్రసాదాలు, తాగునీరు, పాలు, బాదంపాలు, అల్పాహారం వంటివి అందించి వారిని ఆదుకున్నారు. టీటీడీ కల్పించిన సౌకర్యాలపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. వైష్ణవ సంప్రదాయంలో గరుడ సేవకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. పక్షిరాజైన గరుడుడు భగవంతునికి నిత్య సేవకుడు, పరమ భక్తుడు. ఆయనపై స్వామివారు విహరించడం భక్తికి, శరణాగతికి ప్రతీక. గరుడ వాహనంపై ఉన్న స్వామి వారిని దర్శించుకుంటే సర్వపాపాలు తొలగిపోయి, జ్ఞాన వైరాగ్యాలు సిద్ధిస్తాయని పురాణాలు చెబుతున్నాయి. ఈ అపురూప ఘట్టాన్ని తిలకించడం జన్మ ధన్యమైనట్లుగా భక్తులు భావిస్తారు. ఈ అద్భుతమైన కార్యక్రమంలో తిరుమల జీయర్ స్వాములు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు, జేఈవోలు డా. ఎ. శరత్, ప్రభల గోపీనాథ్, సీవీఎస్వో మురళీకృష్ణ, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఇది కాంగ్రెస్ చేతగానితనం వల్ల వచ్చిన కరవు.. - కేటీఆర్

మొదటిపేజీ తరువాయి.. తెలంగాణలో ప్రస్తుతం నెలకొన్న నీటి ఎద్దడికి ప్రకృతి కారణం కాదని, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రాష్ట్రంలో కనిపిస్తున్నది కాలం తెచ్చిన కరవు కాదని, కాంగ్రెస్ సర్కారు తెచ్చిన 'చేతకాని కరవు' అని విమర్శించారు. పంపులు ఆన్ చేయకుండా, రిజర్వాయర్లను నింపకుండా నీటిని వృథాగా దిగువకు వదిలేశారని మండిపడ్డారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఈ ఏడాది జూన్ 1 నుంచి ఇప్పటి వరకు 750 టీఎంసీలకు పైగా గోదావరి నీటిని, 250 టీఎంసీల కృష్ణా జలాలను సముద్రంలోకి, దిగువ ప్రాంతాలకు వదిలేశారని కేటీఆర్ పేర్కొన్నారు. కన్నెపల్లి, దేవాదుల పంపులను సక్రమంగా నిర్వహించి వినియోగించుకుని ఉంటే గోదావరి పరివాహక ప్రాంతంలోని రిజర్వాయర్లు, చెరువులు నిండేవని అన్నారు. కానీ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. కృష్ణా జలాలను వినియోగించుకునేందుకు వీలున్న పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి ఎత్తిపోతల పథకాల పంపులను ఆన్ చేయకుండా నిర్లక్ష్యం వహించారని విమర్శించారు. ప్రాజెక్టుల ద్వారా నీటిని ఎత్తిపోసి నిల్వ చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. ఎల్‌నినో ప్రభావం ఉండవచ్చని మార్చి నుంచే వాతావరణ నిపుణులు హెచ్చరించినా కాంగ్రెస్ ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు రూపొందించలేదని కేటీఆర్ ఆరోపించారు. నీటి లభ్యతపై ముందుగానే అంచనాలు వేసి, సాగు, తాగునీటి అవసరాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాల్సిందని అన్నారు. మరోవైపు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను తరలించుకెళ్లిందని కేటీఆర్ పేర్కొన్నారు. పోతిరెడ్డిపాడు, వెలిగొండ సొరంగం ద్వారా కృష్ణా జలాలను వినియోగించుకుందని, కుప్పం ప్రాంతానికి కూడా నీటిని అందించిందని అన్నారు. తెలంగాణకు దక్కాల్సిన నీటి వాటాను కాపాడుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రాష్ట్రంలో నీటి ఎద్దడి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రాజెక్టుల నిర్వహణ, నీటి నిల్వలు, సాగు, తాగునీటి అవసరాలపై ప్రభుత్వం తక్షణమే దృష్టి పెట్టాలని కేటీఆర్ వ్యాఖ్యల సారాంశం. అయితే, నీటి విడుదలకు సంబంధించిన గణాంకాలు, ప్రభుత్వ నిర్లక్ష్యంపై చేసిన ఆరోపణలు కేటీఆర్ వెల్లడించినవే.

దసరా రద్దీ దృష్ట్యా 7 వేల ప్రత్యేక బస్సులు నడుపుతున్నాం

- తెలంగాణ ఆర్టీసీ ఎండీ

మొదటిపేజీ తరువాయి.. దసరా పండుగ వేళ ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) భారీ ఏర్పాట్లు చేసింది. పండుగ పూట సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సు సర్వీసులను అందుబాటులోకి తీసుకువస్తోంది. దసరా రద్దీని దృష్టిలో ఉంచుకుని 7 వేల ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి వెల్లడించారు.దసరా పర్వదినం సందర్భంగా రద్దీ కొనసాగుతున్న దృష్ట్యా రేపటి నుంచి 19వ తేదీ వరకు అదనపు బస్సులు నడపాలని ఆర్టీసీ ఎండీ అధికారులను ఆదేశించారు. అలాగే పండుగ అనంతరం సొంత ఊళ్ల నుంచి నగరానికి, ఇతర ప్రాంతాలకు తిరుగు ప్రయాణమయ్యే వారి కోసం పెద్ద ఎత్తున ప్రత్యేక సర్వీసులను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. ప్రయాణికులు తమ టికెట్లను సంస్థ అధికారిక వెబ్‌సైట్ tgsrtcbus.in ద్వారా ముందస్తుగా బుక్ చేసుకోవచ్చని అధికారులు సూచించారు. ప్రత్యేక సర్వీసులకు సంబంధించిన ఇతర వివరాల కోసం 040-69440000, 040-23450033 నంబర్లలో కాల్ సెంటర్లను సంప్రదించాలని కోరారు.

ఈ నెలలో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు..

- మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన బిల్లులపై కేంద్రం కసరత్తు..!

మొదటిపేజీ తరువాయి.. మహిళా రిజర్వేషన్లు, లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లులను ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ నెలలో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. లోక్‌సభలో ఈ బిల్లులను ఆమోదింపజేసేందుకు అవసరమైన మద్దతు తమకు ఉందని కేంద్రం ధీమాగా ఉన్నట్లు సమాచారం. మరోవైపు ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్), ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ అంశాలపై ప్రతిపక్షాల నిరసనలు కొనసాగుతున్నాయి. ప్రతిపాదిత బిల్లులకు మద్దతు కూడగట్టేందుకు కేంద్రం ప్రతిపక్ష పార్టీలతోనూ చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ఈ ఏడాది ఏప్రిల్ 17న బడ్జెట్ సమావేశాల సందర్భంగా నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ల అమలుకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోయింది. దీంతో ఈసారి బిల్లులను ఆమోదింపజేసుకోవడం కేంద్రానికి కీలకంగా మారింది. రాజ్యాంగ సవరణ బిల్లుల ఆమోదానికి పార్లమెంట్‌లో ప్రత్యేక మెజారిటీ అవసరం. లోక్‌సభలో ప్రస్తుతం 540 మంది సభ్యులుండగా, మొత్తం సభ్యుల్లో మూడింట రెండొంతుల మద్దతు కీలకం. ఈ లెక్కన సుమారు 360 మంది సభ్యుల మద్దతు అవసరం. ఎన్డీయేకు లోక్‌సభలో మెజారిటీ ఉన్నప్పటికీ, రాజ్యాంగ సవరణకు అవసరమైన సంఖ్యాబలం విషయంలో సవాళ్లు ఉన్నట్లు సమాచారం. ప్రభుత్వానికి మద్దతు పెరిగిందని, తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 20 మంది ఎంపీలు, శివసేన (యూబీటీ)కి చెందిన ఆరుగురు ఎంపీలు అధికార పక్షం వైపు మారారని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. అయితే బిల్లుల ఆమోదానికి అవసరమైన సంఖ్యాబలంపై తుది స్పష్టత ఓటింగ్ సమయంలోనే రానుంది. బిల్లులకు మద్దతు కూడగట్టేందుకు డీఎంకేతో కేంద్రం చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. తమిళనాడు ఎన్నికల తర్వాత కాంగ్రెస్‌తో ఆ పార్టీ విభేదాలు రావడం, ఇండియా కూటమి నుంచి బయటకు రావడం నేపథ్యంలో ఈ సంప్రదింపులకు ప్రాధాన్యం ఏర్పడింది. మరికొన్ని చిన్న ప్రతిపక్ష పార్టీలతోనూ కేంద్రం మాట్లాడుతున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఆగస్టు 13న ముగిసిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ఇంకా అధికారికంగా ప్రొరోగేషన్ ప్రకటించలేదు. దీంతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించేందుకు అవకాశం ఉందని సమాచారం. అక్టోబర్ 26, 27 తేదీల్లో సంవిధాన్ సదన్‌లో జరగనున్న 12వ బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరమ్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక సమావేశాల తేదీలను ఖరారు చేయనున్నట్లు తెలుస్తోంది. సమావేశాలకు వారం రోజుల ముందుగా నోటీసు ఇచ్చే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

TGTEL/26/A7716
ఉద్యమ పోరు
ప్రతి పదం పోరాట కదం
గురువారం 15.10.2026

తురక కాశ సంక్షేమ సంఘం గుర్రంపోడు మండల అధ్యక్షుడిగా షేక్ లతీఫ్ నియామకం

ఉద్యమ పోరు, గుర్రంపోడు, అక్టోబర్ 16 : తెలంగాణ తురక కాశ సంక్షేమ సంఘం నల్లగొండ జిల్లా ఆధ్వర్యంలో సంఘాన్ని గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు బలోపేతం చేసే కార్యక్రమంలో భాగంగా నూతన నియామకాలు చేపట్టారు. గుర్రంపోడు మండల అధ్యక్షుడిగా షేక్ లతీఫ్, కాచారం గ్రామ శాఖ అధ్యక్షుడిగా ఎండీ షబ్బీర్ నియమితులయ్యారు.కాచారం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ తురక కాశ సంక్షేమ సంఘం నల్లగొండ జిల్లా అధ్యక్షులు షేక్ అబ్దుల్ రహీం నూతనంగా నియమితులైన ఇరువురికి నియామక పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా షేక్ అబ్దుల్ రహీం మాట్లాడుతూ, తురక కాశ సామాజిక వర్గ అభివృద్ధి, సంక్షేమం కోసం నాయకులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. సామాజిక వర్గంలో ఐక్యతను పెంపొందిస్తూ, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. మండల, గ్రామ స్థాయిల్లో సంఘాన్ని మరింత బలోపేతం చేసి, సభ్యులందరినీ సమన్వయం చేసుకుంటూ సంఘం ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.నూతనంగా నియమితులైన షేక్ లతీఫ్, ఎండీ షబ్బీర్ మాట్లాడుతూ, తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సంఘ అభివృద్ధికి, తురక కాశ సామాజిక వర్గ సంక్షేమానికి అంకితభావంతో పనిచేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ తురక కాశ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ లతీఫ్, నల్లగొండ నియోజకవర్గ అధ్యక్షులు షేక్ లతీఫ్ పాషా, సంఘం నాయకులు ఎండీ ఖాసీం వలి, ఎండీ అహ్మద్, షేక్ మహిముద్ తదితరులు పాల్గొన్నారు.

బోనకల్‌లో కాంగ్రెస్ బైక్ ర్యాలీని విజయవంతం చేయాలి

- **కాంగ్రెస్ శ్రేణులకు మండల అధ్యక్షుడు కర్నాటి రామకోటేశ్వరరావు పిలుపు**

ఉద్యమ పోరు, బోనకల్, అక్టోబర్ 16 : మధిర నియోజకవర్గంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బోనకల్ మండలంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కర్నాటి రామకోటేశ్వరరావు పిలుపునిచ్చారు.మధిర నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని ఆయన పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు, నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలనే లక్ష్యంతో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అలాగే ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు కార్యక్రమానికి హాజరై వార్తా కవరేజీ అందించాలని విజ్ఞప్తి చేశారు.కాంగ్రెస్ పార్టీ శ్రేణులందరూ సమన్వయంతో ముందుకు సాగి బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని కర్నాటి రామకోటేశ్వరరావు కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకుడు పైడిపల్లి కిషోర్ కుమార్, మండల నాయకులు ఎర్రం శెట్టి సుబ్బారావు, పాసంగులపాటి కోటేశ్వరరావు, సర్పంచ్ బద్రు నాయక్, కందుల పాపారావు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు,బాలికల భద్రతకు సంబంధించిన విభాగాల పనితీరుపై సమీక్ష సమావేశం నిర్వహించిన అదనపు డీసీపీ

- **మహిళల రక్షణ,భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి**

ఉద్యమ పోరు, నిజామాబాద్, అక్టోబర్ 16 : నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఆదేశాల మేరకు శుక్రవారం నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో అదనపు డీసీపీ (అడ్మిన్) ఎన్.శుభం ప్రకాష్ మహిళల భద్రత,రక్షణ,సంక్షేమానికి సంబంధించిన వివిధ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో షీ టీమ్స్,భరోసా సెంటర్,యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్,గృహ హింస నిరోధక విభాగం,మిస్సింగ్ ఉమెన్,మహిళా సహాయ విభాగాలు,ఉమెన్ హెల్ప్ డెస్క్ తదితర విభాగాల పనితీరును సమీక్షించారు.ఆయా విభాగాల ద్వారా మహిళలు,బాలికలకు అందిస్తున్న సేవలు,అందిన ఫిర్యాదులు,వాటిపై తీసుకుంటున్న చర్యలు,పరిష్కారం కాని కేసుల పురోగతి తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.మహిళలు,బాలికలు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల అధికారులు సత్వరమే స్పందించాలని,బాధితులకు భరోసా కల్పిస్తూ వారికి న్యాయం జరిగేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మహిళలపై వేధింపులు, గృహ హింస,మానవ అక్రమ రవాణా వంటి నేరాల నివారణకు ప్రత్యేక దృష్టి సారించాలని,బాధితుల ఫిర్యాదులను సున్నితంగా స్వీకరించి చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. షీ టీమ్స్ ద్వారా మహిళలు, బాలికలకు భద్రతపై అవగాహన కల్పిస్తూ, వేధింపులకు పాల్పడే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. భరోసా సెంటర్ ద్వారా బాధిత మహిళలకు అవసరమైన సహాయం, కౌన్సెలింగ్, సంబంధిత శాఖల సమన్వయంతో తగిన సేవలు అందించాలని సూచించారు. అలాగే మహిళా పోలీస్ స్టేషన్లు, ఉమెన్ హెల్ప్ డెస్క్‌లకు వచ్చే ఫిర్యాదులపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని,ప్రతి ఫిర్యాదును బాధ్యతాయుతంగా పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మహిళలు, బాలికలకు సురక్షిత వాతావరణం కల్పించడమే లక్ష్యంగా అన్ని సంబంధిత విభాగాలు సమన్వయంతో పనిచేయాలని అదనపు డీసీపీ ఎన్. శుభం ప్రకాష్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో సి.సి.ఆర్.బి ఏసిపి గురు నాయుడు, మహిళా పోలీస్ స్టేషన్ సిఐ ప్రసాద్,సి.సి.ఎస్ సి.ఐ సురేష్,షీ టీం మహిళా ఎస్సై స్రవంతి,సంబంధిత విభాగల అధికారులు పాల్గొన్నారు.

పాల్వాయిలో ఘనంగా కనకదుర్గమ్మకు కుంకుమార్చన, అన్నదానం

ఉద్యమ పోరు, గుర్రంపోడు, అక్టోబర్ 16 : గుర్రంపోడు మండలం పాల్వాయి గ్రామంలోని కనకదుర్గమ్మ దేవాలయంలో శుక్రవారం కుంకుమార్చన పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.వేద పండితులు నిమ్మగడ్డ సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేకంగా కుంకుమ అర్చన పూజా కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా జరిపారు.ఈ పూజల్లో గ్రామస్తులు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.పూజా కార్యక్రమం అనంతరం, కనకదుర్గమ్మ గుడి కమిటీ సభ్యులు మరియు దాతల సహకారంతో భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో పాల్వాయి గ్రామ మాజీ సర్పంచ్ రంగరాజు వెంకటేశ్వర్లు,మూడో వార్డు సభ్యులు కొండ్రపల్లి గిరి, ప్రముఖులు జోగు వెంకన్న, మామిళ్ళ శ్రీను,వెంకటాపురం బిక్షం,వెంకటాపురం సత్యనారాయణ,జోగు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు కేశంపేటలో ముందస్తు కార్యాచరణ.. 26 గ్రామాల్లో కీలక తీర్మానాలు

ఉద్యమ పోరు, కేశంపేట, అక్టోబర్ 15 : ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని ప్రజలకు ఇబ్బందులు కలగకుండా కేశంపేట మండలంలోని 26 గ్రామ పంచాయతీల్లో శుక్రవారం ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. సర్పంచులు, ప్రత్యేకాధికారుల ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశాల్లో తాగునీటి భద్రత, పశుగ్రాసం, వ్యవసాయం, ఉపాధి కల్పన, జలసంరక్షణపై చర్చించి పలు కీలక తీర్మానాలు చేశారు.తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలుఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గి నీటి కొరత ఏర్పడే పరిస్థితులను ఎదుర్కొనేందుకు గ్రామాల్లోని నీటి వనరులను గుర్తించాలని నిర్ణయించారు. బోరుబావులు, నీటి సరఫరా వ్యవస్థలను పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టడంతో పాటు నీటి వృథాను అరికట్టాలని తీర్మానించారు.పశుగ్రాసం, వ్యవసాయంపై ప్రత్యేక దృష్టిఅక్టోబర్ 2026 నుంచి జూలై 2027 వరకు పశువులకు సరిపడా పశుగ్రాసం అందుబాటులో ఉండేలా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని నిర్ణయించారు. వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే రైతులు నష్టపోకుండా నీటి లభ్యతకు అనుగుణంగా పంటల సాగు, పంటల మార్పిడిపై అవగాహన కల్పించాలని సూచించారు. తక్కువ నీటితో సాగు చేయగల పంటలను ప్రోత్సహించాలని తీర్మానించారు.జలసంరక్షణకు ప్రాధాన్యత'ఇంటికో ఇంకుడు గుంత.. పంటకో పంటకుంట.. ఊరికో ఊటకుంట' నినాదంతో గ్రామాల్లో జలసంరక్షణ పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఇంకుడు గుంతలు, వ్యవసాయ కుంటలు, బోరుబావుల పునరుద్ధరణ, భూగర్భ జలాల పెంపునకు అవసరమైన నిర్మాణాలను గుర్తించి కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని తీర్మానించారు.ఉపాధి పనుల ద్వారా గ్రామీణాభివృద్ధివిబి-జీ రామ్ జీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంచేందుకు నీటి సంరక్షణ, భూసంరక్షణ, గ్రామీణ మౌలిక వసతులకు సంబంధించిన పనులను గుర్తించాలని నిర్ణయించారు.ఈ గ్రామసభల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు. ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొంటూ తాగునీటి భద్రత, వ్యవసాయ పరిరక్షణ, పశుగ్రాసం, ఉపాధి కల్పనతో పాటు భవిష్యత్తు నీటి అవసరాలను తీర్చేలా గ్రామస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని నిర్ణయించారు.

వార్డు సమస్యలు తెలుసుకున్న సర్పంచ్ ఎర్రం లింగం

ఉద్యమ పోరు, నిజామాబాద్, అక్టోబర్ 16 : శుక్రవారం నందిపేట్ గ్రామపంచాయతీ పరిధిలోని 16వ వార్డులో సర్పంచ్ ఎర్రం లింగం కాలినడకన పర్యటించి వార్డులో నెలకొన్న సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు.ఈ పర్యటనలో గ్రామ పంచాయతీ కార్యదర్శి మహేందర్,వార్డు సభ్యుడు నరేష్,కరోబార్లు,గ్రామపంచాయతీ వాటర్‌మ్యాన్ రఫీక్ మహబూబ్‌తో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి,వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకునే దిశగా వివరాలు సేకరించి త్వరలోనే అమలు చేస్తామని ఆయన అన్నారు.

జగన్మాత కరుణాకటాక్షాలు ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలి

- ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి

- **ఆఫీసర్స్ కాలనీ,ఏబీ విల్లాస్,శ్రీనివాస్ కాలనీ, మొగలిగిద్దలో అమ్మవారికి ప్రత్యేక పూజలు : ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి**

ఉద్యమ పోరు, షాద్ నగర్, అక్టోబర్ 16 : దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి షాద్‌నగర్ పట్టణంలో ఆఫీసర్స్ కాలనీ,ఏబీ విల్లాస్,శ్రీనివాస్ కాలనీ,మొగలిగిద్ద గ్రామంలో కొలువైన అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని ఆలయాల్లో జరిగిన విశేష అర్చనలు,కుంకుమార్చనలలో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డితో పాటు వారి సతీమణి లక్ష్మి రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ..జగన్మాత కరుణాకటాక్షాలు ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని,అందరికీ ఆయురారోగ్యాలు,అష్టైశ్వర్యాలు సిద్ధించాలని ప్రార్థించారు.పూజల అనంతరం ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమాల్లో పాల్గొని భక్తులకు ప్రసాదాలు అందజేశారు.ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు కానుగు అనంతయ్య చెట్ల పావని నరసింహ,అలమాకుల చెన్నయ్య చిన్న యాదగిరి,బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రాయికల్ వెంట్ రెడ్డి,పోమాలపల్లి సర్పంచ్ స్వప్న భూపాల్ రెడ్డి,మొగిలిగిద్ద సర్పంచ్ బుగ్గ కృష్ణ,మాజీ సర్పంచులు చక్కటి వెంకటేష్ యాదవ్,తాండ్ర విష్ణువర్ధన్ రెడ్డి,మాజీ ఎంపిటిసి అశోక్ రెడ్డి, ఉపసర్పంచ్ పోలమేని రాములు,నాయకులు జ్ఞానేశ్వర్,అందె రాజేశ్వర్,అన్వారి రాజు,బాలరాజ్,అల్లాడ సూరి కిరణ్,డాక్టర్ ఎంజాయ్,డిజె ప్రవీణ్,శ్రీను,రమేష్,గందె సురేష్,అన్వారీ మురళితదితరులు పాల్గొన్నారు.

TGTEL/26/A7716
ఉద్యమ పోరు
ప్రతి పదం పోరాట కదం

లక్ష్మీదేవి అలంకారంలో గాయత్రి అమ్మవారు

- గాయత్రి మహాక్షేత్రంలో వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

ఉద్యమ పోరు, శామీర్‌పేట, అక్టోబర్ 16 : తూంకుంటలోని శ్రీ గాయత్రి మహాక్షేత్రంలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజు శుక్రవారం అమ్మవారిని లక్ష్మీదేవిగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణం భక్తుల రాకతో సందడిగా మారింది. ఆలయ ధర్మకర్త, వాగ్‌బ్రహ్మ, శిష్యజనోద్ధారక డాక్టర్ ఎస్.వి.ఎల్.ఎన్. మూర్తి ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి అలంకరణ భక్తులను ఆకట్టుకోగా, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్.వి.ఎల్.ఎన్. మూర్తి మాట్లాడుతూ.. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తుల కోసం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆధ్యాత్మిక వాతావరణంలో జరుగుతున్న ఉత్సవాల్లో నగరంతో పాటు వివిధ మండలాల నుంచి భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుంటున్నారు. ఆలయ సభ్యులు ఉత్సవాల నిర్వహణలో పాల్గొంటున్నారు.

నూతనంగా బాధ్యతలు చేపట్టిన పోలీసు అధికారులు..

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో మర్యాదపూర్వక భేటీ
- శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి:ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఉద్యమ పోరు, షాద్ నగర్, అక్టోబర్ 16 : నూతనంగా బాధ్యతలు చేపట్టిన కేశంపేట సీఐ శ్రీనివాస్,షాద్‌నగర్ ట్రాఫిక్ సీఐ వెంకటేశ్వర్లు షాద్‌నగర్ ఎమ్మెల్యే,ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఇరువురు పోలీసు అధికారులు ఎమ్మెల్యేకు మొక్కలను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ..నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని కోరారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శాంతిభద్రతల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.ముఖ్యంగా షాద్‌నగర్ పట్టణంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని,ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పోలీసు అధికారులకు సూచించారు.ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ,పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తగ్గేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలో దుర్గామాతకు ప్రత్యేక పూజలు : తోకల శ్రీనివాస్ రెడ్డి.

ఉద్యమ పోరు, రాజేంద్రనగర్, అక్టోబర్ 16 కాటేదాన్ డివిజన్ బాబుల్ రెడ్డి నగర్‌లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మవారి మండపాన్ని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డి సందర్శించారు.ఈ సందర్భంగా దుర్గామాత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి,ప్రజలందరూ సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు.అనంతరం భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నప్రసాద కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిభావంతో,ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించుకోవడం అభినందనీయమని పేర్కొంటూ,అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు రాజు స్వామి,సంతు గౌడ్,రమేష్ రెడ్డి,గోపాల్ నాయక్,మధుసూదన్ రెడ్డి,కృష్ణ నాయక్,శ్రీకాంత్ రెడ్డి,అడికే శివ,శంకర్ రెడ్డి తదితరులు పాల్గొనారు.

అత్తాపూర్లో అర్ధరాత్రి బైక్ పెట్రోలింగ్.. పోలీస్ కమిషనర్ సజ్జనార్ ఆకస్మిక పర్యటన.

ఉద్యమ పోరు, రాజేంద్ర నగర్, అక్టోబర్ 16 : అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణ,శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా పోలీసులు అర్ధరాత్రి ప్రత్యేక బైక్ పెట్రోలింగ్ నిర్వహించారు.ఇదే సమయంలో హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ ఆకస్మికంగా పర్యటించడంతో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది.అత్తాపూర్ ఇన్స్పెక్టర్ ఎ.సీతయ్య నేతృత్వంలో గురువారం అర్ధరాత్రి పోలీసు సిబ్బంది ద్విచక్రవాహనాలపై విస్తృతంగా గస్తీ నిర్వహించారు.ఈ సందర్భంగా వీధుల్లో అనవసరంగా సంచరిస్తున్న వారిని,గుంపులుగా కూర్చున్న వారిని విచారించి,కౌన్సెలింగ్ ఇచ్చి అక్కడి నుంచి పంపించారు.అనంతరం అర్ష్ మహల్ ప్రాంతంలోని రౌడీషీటర్లు కదీర్,యూసుఫ్ అలియాస్ నాగ,యాసీన్ ఇళ్లకు పోలీసులు వెళ్లి వారి కదలికలపై ఆరా తీశారు.వారి ప్రస్తుత కార్యకలాపాలను పరిశీలించడంతో పాటు,ఏవైనా నేరపూరిత చర్యలకు పాల్పడుతున్నారా అనే అంశాలపై తనిఖీలు నిర్వహించారు.వేగవంతమైన చర్యలు తీసుకోవాలి..ఏసీపీ జానకి రెడ్డి.ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ సీతయ్య రౌడీషీటర్లకు గట్టి హెచ్చరికలు జారీ చేశారు.ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా,ప్రజలకు ఇబ్బందులు కలిగించినా,శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ నేరాల నియంత్రణ కోసం ప్రత్యేక నిఘా కొనసాగిస్తామని,అర్ధరాత్రి బైక్ పెట్రోలింగ్,అనుమానాస్పద వ్యక్తుల తనిఖీలు నిరంతరం నిర్వహిస్తామని పోలీసులు తెలిపారు.

భరత్ సింగ్ ఠాకూర్ పుట్టినరోజు సందర్భంగా వృద్ధాశ్రమానికి నిత్యావసర సరుకుల పంపిణీ

ఉద్యమ పోరు, వనస్థలిపురం, అక్టోబర్ 16 : బిజెపి సీనియర్ నాయకుడు భరత్ సింగ్ ఠాకూర్ పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వనస్థలిపురంలోని 'రెడీ టు సర్వ్ ఓల్డ్ ఏజ్ హోమ్'లోని వృద్ధులకు అవసరమైన బియ్యం, పప్పులు, ఇతర నిత్యావసర సరుకులను, ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రంగారెడ్డి అర్బన్ ప్రధాన కార్యదర్శి బొల్గాం యశోపాల్ గౌడ్ హాజరయ్యారు. తరుణ్ ఠాకూర్, కిరణ్ కుమార్, సంప్రత్, వరుణ్ ఠాకూర్, రాజు, వెంకటేష్ తదితరులు పాల్గొని వృద్ధులకు నిత్యావసర సరుకులను అందజేశారు.ఈ సందర్భంగా ఓల్డ్ ఏజ్ హోమ్ వ్యవస్థాపకుడు పెద్దిశంకర్ మాట్లాడుతూ, భరత్ సింగ్ ఠాకూర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వృద్ధుల అవసరాలను గుర్తించి, వారికి ఉపయోగపడేలా నిత్యావసర సరుకులు అందజేయడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ మానవతా సేవలో భాగస్వాములైన బొల్గాం యశోపాల్ గౌడ్, తరుణ్ ఠాకూర్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.పుట్టిన రోజులను సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం సమాజంలో మానవతా విలువలను పెంపొందించడంతో పాటు, అవసరంలో ఉన్నవారికి అండగా నిలిచే స్ఫూర్తిని కలిగిస్తుందని ఈ కార్యక్రమం చాటిచెప్పింది.

దుర్గామాత మండపం వద్ద మహా అన్నప్రసాద కార్యక్రమం..

- సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు..

ఉద్యమ పోరు, చిగురుమామిడి, అక్టోబర్ 16 : కేంద్రంలోని గాంధీనగర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత సన్నిధిలో శుక్రవారం మహా అన్నప్రసాద కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజు అమ్మవారు సరస్వతీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలు,మండల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలతో గ్రామాలు సుభిక్షంగా వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించారు.మహా అన్నప్రసాద కార్యక్రమంలో భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.ఈ కార్యక్రమంలో స్థానిక ఉపసర్పంచ్ విజయలక్ష్మి రాజు యాదవ్,యూత్ అధ్యక్షుడు కాశబోయిన రాజు యాదవ్, యూత్ సభ్యులు చకిలం శ్రీనివాస్, సూర్య ప్రకాష్, రాజు, అనుమోజు, చిరంజీవి, పెనుకుల సంపత్, నరేష్, చెరుకు అభిషేక్, చెరుకు సంజీవ్, శ్యామ్, శ్రీకాంత్, చెరుకు సమ్మయ్య, రాజయ్య, సంపత్, నరసయ్య, సాగర్, ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

ఆరుట్ల గ్రామంలో ఎస్ బి ఐ వినియోగదారుల సేవా కేంద్రం ప్రారంభం

- ఎస్ బి ఐ బ్యాంక్ మేనేజర్ అప్పలనాయుడు
- ప్రారంభోత్సవంలో పాల్గొన్న వెదిరె వెంకట రమణ రెడ్డి
- కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు నూకం బాలరాజ్ ముదిరాజ్
- వైయస్సార్ మాధగోని జంగయ్యగౌడ్

ఉద్యమ పోరు, ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 16 : మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో స్వయం ఉపాధి వ్యాపారంలో భాగంగా నిర్వాహకుడు వెదిరె పురుషోత్తం రెడ్డి ఏర్పాటు చేసుకున్న ఎస్ బి ఐ వినియోగదారుల సేవా కేంద్రాన్నిప్రారం భించిన ఎస్ బి హెచ్ బ్యాంక్ మేనేజర్ అప్పల నాయుడు ప్రారంభోత్సవంలో పాల్గొన్న వెదిరె వెం కటర మణరెడ్డి కాంగ్రెస్ పార్టీ ఆరుట్ల గ్రామశాఖ అధ్యక్షుడు నూకం బాలరాజ్ ముదిరాజ్ వైయ స్సార్ మాధగోని జంగయ్యగౌడ్ అనంతరం సేవాకేంద్రం నిర్వాహకుడు వెదిరె పురుషోత్తం రెడ్డి బ్యాంక్ మేనేజర్ అప్పలనాయుడు వెదిరె వెంకటరమణ రెడ్డిని నూకం బాలరాజు ముదిరాజ్ వై యస్సార్ మాధగోని జంగయ్య గౌడ్ ను శాలువాతో ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగాఎస్ బి ఐ బ్యాంక్ మేనేజర్ అప్పల నాయుడు మాట్లాడుతూ ఆరుట్ల ఎస్ బి ఐ బ్యాంక్ లో లావాదే వీలు జరుపుకునే ఖాతాదారులు అత్యవసర సమయంలో ఎస్ బిఐ వినియోగదారుల సేవా కేం ద్రాలలో లావాదేవీలు జరుపు కోవడానికి వీలుంటుంది అన్నారు ఏటీఎం సెంటర్ ఎలాగో ఎస్ బి ఐ సేవా కేంద్రాలు అలా ఖాతాదారులకు అత్యవసర సమయానికి అవసరం వస్తాయి అని అన్నారు ఎస్ బి ఐ బ్యాంక్ ఖాతాదారులు సేవా కేంద్రాలను వినియోగించుకోవాలి అని అన్నారు ఈకార్యక్రమంలో ఎస్ బి ఐ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ యాదగిరి రెడ్డి బ్యాంక్ సిబ్బంది గ్రామ పెద్దలు పురుషోత్తం రెడ్డి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల కష్టాలు చూడలేకే కేటీఆర్‌కు ట్వీట్ చేశా: రైతు బిడ్డ అశ్విని

- పోచంపల్లి గ్రామాన్ని సందర్శించి భరోసా ఇచ్చిన మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్

ఉద్యమ పోరు, గుర్రంపోడు, అక్టోబర్ 16 : సాగునీరు, విద్యుత్ కొరతతో పంటలు ఎండిపోతూ రైతాంగం అల్లాడి పోతున్న తరుణంలో నల్గొండ జిల్లా గుర్రంపోడు మండలం పోచంపల్లి గ్రామానికి చెందిన రైతు బిడ్డ బైరు అశ్విని సోషల్ మీడియా వేదికగా చేసిన పోరాటం ప్రాధాన్యత సంతరించుకుంది. తమ గ్రామంలోని పంటల పరిస్థితిని వివరిస్తూ ఆమె ట్విట్టర్ వేదికగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లకు పంపిన సందేశంపై పార్టీ నాయకత్వం తక్షణమే స్పందించింది. కేటీఆర్ ఆదేశాల మేరకు నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ పోచంపల్లి గ్రామానికి చేరుకుని బాధితులను పరామర్శించారు.ముందుగా నోముల భగత్ ఆ గ్రామ రైతు బిడ్డ బైరు అశ్వినిని కలిసి, ఆమె ట్విట్టర్‌లో కేటీఆర్‌కు పంపిన సందేశం వెనుక ఉన్న కారణాలను, గ్రామంలో నెలకొన్న తీవ్రమైన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అశ్విని మాట్లాడుతూ, "మా నాన్న పడుతున్న కష్టాలను, మా గ్రామంలోని రైతులు నీరు లేక పడుతున్న ఇబ్బందులను కళ్లారా చూసి తట్టుకోలేకపోయాను. అందుకే మా బాధను పెద్ద సార్ల దృష్టికి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో ట్విట్టర్‌లో మెసేజ్ చేశాను" అని తన ఆవేదనను పంచుకున్నారు.అనంతరం గ్రామ రైతులు మాజీ ఎమ్మెల్యే వద్ద తమ కష్టాలను చెప్పుకున్నారు.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 24 గంటల నాణ్యమైన కరెంట్ వచ్చేదని, తాము పొలాల దగ్గరకు వెళ్లి చూడకపోయినా పంటలు ఎంతో సస్యశ్యామలంగా పండేవని గుర్తుచేసుకున్నారు. కానీ ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో కరెంట్, సాగునీరు లేక తీవ్రంగా నష్టపోతున్నామని వాపోయారు. ఎండిపోతున్న పంటలను కాపాడుకోవడానికి చామలేడు గ్రామం నుండి సుమారు 5 కిలోమీటర్ల మేర పైపులు వేసుకుని నీటిని తెచ్చుకుంటున్నామని, అయితే కనీసం రెండు మూడు గంటలు కూడా కరెంట్ ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ఇచ్చే కొద్దిపాటి కరెంట్ కూడా పైపుల సగానికి రాకముందే నిలిచిపోతోందని కన్నీరు పెట్టుకున్నారు.రైతుల మరియు అశ్విని మాటలను పూర్తిగా ఆలకించిన నోముల భగత్ వారికి ధైర్యం చెప్పారు. రాబోయేది బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని కెసిఆర్ ముఖ్యమంత్రిని బీఆర్ఎస్ ప్రభుత్వం రాగానే ప్రాధాన్యత క్రమంలో పోచంపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ పనులను సంపూర్ణంగా పూర్తి చేసి తీరుతామని, గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని రైతులకు స్పష్టమైన హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే ఇచ్చిన ఈ భరోసాతో పోచంపల్లి గ్రామ రైతులు, అశ్విని కుటుంబ సభ్యులు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, సీనియర్ నాయకులు ఉద్యమకారులు రైతులు తదితరులు పాల్గొన్నారు

రైతులకు నాణ్యమైన విద్యుత్ ను అందిస్తున్నాం..

- విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు ఉంటే సమాచారం ఇవ్వండి..
- సుందరగిరి,కొండాపూర్ గ్రామాల్లో పంట పొలాలను పరిశీలించిన విద్యుత్ శాఖ ఎస్ఈ విజయేందర్ రెడ్డి..

ఉద్యమ పోరు, చిగురుమామిడి, అక్టోబర్ 16 : పరిధిలోని సుందరగిరి,కొండాపూర్ గ్రామాల్లో విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు శుక్రవారం విస్తృతంగా పర్యటించారు.ఈ పర్యటనలో విద్యుత్ శాఖ ఎస్ఈ విజెందర్ రెడ్డి,డీఈ తిరుపతి,ఇందుర్తి ఏఈ అన్వేష్ లు కలిసి స్థానిక పంట పొలాలను క్షేత్రస్థాయిలో సందర్శించి, విద్యుత్ సరఫరా తీరును పరిశీలించారు.ఈ సందర్భంగా అధికారులు పొలాల వద్ద ఉన్న రైతులతో నేరుగా మాట్లాడారు.వ్యవసాయానికి అందుతున్న విద్యుత్ సరఫరాపై ఆరా తీస్తూ, రైతులకు ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పొలాల వద్ద ఉన్న ట్రాన్స్ఫార్మర్లను సైతం పరిశీలించి రైతులకు పలు సూచనలు సలహాలు చేశారు.అనంతరం అధికారులు మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలోని రైతులకు ఎలాంటి విద్యుత్ సమస్యలు లేవని,సరఫరా సజావుగా సాగుతోందని స్పష్టం చేశారు.రైతులకు విద్యుత్ పరంగా ఎలాంటి అంతరాయాలు లేదా సమస్యలు ఎదురైనా,వెంటనే సంబంధిత విద్యుత్ శాఖ అధికారుల లేదా లైన్ సిబ్బంది దృష్టికి తీసుకురావాలని వారు కోరారు.క్షేత్రస్థాయిలో సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని,సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని అధికారులు రైతులకు భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ సిబ్బంది,స్థానిక రైతులు పాల్గొన్నారు.

చిగురుమామిడిలో బతుకమ్మ పండుగ కోసం ముమ్మరంగా సాగుతున్న ఏర్పాట్లు..

- ముస్తాబైన ఊర చెరువు కట్ట, విద్యుదీపాల ఏర్పాటు..
- సర్పంచ్ ఆకవరం భవాని శివప్రసాద్,ఉపసర్పంచ్ కాశబోయిన విజయ లక్ష్మి రాజు యాదవ్..

ఉద్యమ పోరు, చిగురుమామిడి, అక్టోబర్ 16 : తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను పురస్కరించుకుని, చిగురుమామిడి మండల కేంద్రంలో పండుగ ఏర్పాట్లను సర్పంచ్ ఆకవరం భవాని శివప్రసాద్,ఉపసర్పంచ్ కాశబోయిన విజయలక్ష్మి రాజు యాదవ్ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరుగుతున్నాయి.మహిళలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకునేలా స్థానిక గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లను చేస్తున్నారు.ఈ ఏర్పాట్లను సర్పంచ్ ఆకారం భవాని శివప్రసాద్,ఉపసర్పంచ్ కాశబోయిన విజయలక్ష్మి రాజు యాదవ్ స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు.పనుల్లో ఎక్కడా లోపాలు లేకుండా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.బతుకమ్మలను సురక్షితంగా నిమజ్జనం చేసేందుకు వీలుగా ఊర చెరువు కట్టను పూర్తిగా పరిశుభ్రం చేసి, సుందరంగా తీర్చిదిద్దారు.ముఖ్యంగా గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది మాలకుంట కట్టకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచేలా ఏర్పాట్లు చేశారు.స్థానిక గ్రంథాలయం నుండి మహిళా సమైక్య భవనం వరకు రహదారి పొడవునా కట్ట వెంబడి రంగురంగుల విద్యుత్ దీపాలను (లైటింగ్) ఏర్పాటు చేశారు.ఈ అద్భుతమైన లైటింగ్ ఏర్పాట్లపై గ్రామస్తులు, ముఖ్యంగా మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఆడపడుచులు బతుకమ్మలు ఆడేటప్పుడు, నిమజ్జనానికి వెళ్లేటప్పుడు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా గ్రామ పంచాయతీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. గ్రామంలోని ప్రధాన కూడళ్లు, అవసరమైన చోట్ల మొరం పోసి రోడ్డును చదును చేశారు. గుంతలను పూడ్చివేసి నడక సాఫీగా సాగేలా చర్యలు తీసుకున్నారు. మండల కేంద్రంలో పండుగ వాతావరణం నెలకొనడంతో ఊరంతా కోలాహలం కనిపిస్తోంది.

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బతుకమ్మ సంబరాలు.

ఉద్యమ పోరు, రాజేంద్ర నగర్, అక్టోబర్ 16 : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలన భవనం వద్ద బతుకమ్మ సంబరాలు శుక్రవారం ఘనంగా జరిగాయి.పరిపాలన భవనం ఆవరణలో తొలుత విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య సతీమణి శ్రీమతి అల్దాస్ భారతి,విశ్వవిద్యాలయ మహిళా అధికారులు గౌరమ్మకి పూజలు నిర్వహించారు. తర్వాత మహిళా అధికారులు,మహిళా ఉద్యోగులు ఆడుతూ పాడుతూ బతుకమ్మ సంబరాలు చేశారు.ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

బతుకమ్మ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి

- టి .మల్లికార్జున్ మున్సిపల్ కమిషనర్

ఉద్యమ పోరు, హుస్నాబాద్ , అక్టోబర్ 16 : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ వేడుకల ఏర్పాట్లను మున్సిపల్ ఛైర్‌పర్సన్ దండి లక్ష్మి, కమిషనర్ టి.మల్లికార్జున్ శుక్రవారం పట్టణంలోని ఎల్లమ్మ చెరువు ,పల్లె చెరువు వద్ద క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పట్టణంలోని ప్రధాన బతుకమ్మ ఘాట్లు, చెరువులు, మహిళలు అధికంగా పాల్గొనే ప్రాంతాలను సందర్శించి ఏర్పాట్ల పురోగతిని సమీక్షించారు. పండుగ సందర్భంగా ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి, బతుకమ్మ ఆడే ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు.ఈ ఏర్పాట్ల పరిశీలనలో మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, తదితరులు ఉన్నారు.

అక్కన్నపేట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడిగా రాజు నాయక్

- మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌కు గిరిజన సంఘాల కృతజ్ఞతలు

ఉద్యమ పోరు, అక్కన్నపేట, అక్టోబర్ 16 : బీఆర్ఎస్ అక్కన్నపేట మండల అధ్యక్షుడిగా పెద్ద తండాకు చెందిన గుగులోతు రాజు నాయక్ నియమితులయ్యారు. ఆయన నియామకంపై గిరిజన సంఘాల నాయకులు, పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు.ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో రాజు నాయక్ చురుకుగా పాల్గొన్నారని, గత 20 ఏళ్లుగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఆయనకు పార్టీ బాధ్యతలు అప్పగించిన మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్‌కు గిరిజన సంఘాల తరపున కృతజ్ఞతలు తెలిపారు. రాజు నాయక్ నాయకత్వంలో మండలంలో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

హుస్నాబాద్‌లో కబడ్డీ అకాడమీ ఏర్పాటు

- 40 మంది బాలబాలికలకు శిక్షణ, వసతి సదుపాయాలు

ఉద్యమ పోరు, హుస్నాబాద్ , అక్టోబర్ 16 : హుస్నాబాద్ నియోజకవర్గంలో కబడ్డీ అకాడమీ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. ఈ మేరకు ఆర్థిక శాఖ 2026 అక్టోబరు 15న జీవో నంబరు 1660 జారీ చేసింది. అకాడమీ ద్వారా 40 మంది క్రీడాకారులకు శిక్షణ, వసతి సదుపాయాలు కల్పించనున్నారు.అకాడమీలో 20 మంది బాలురు, 20 మంది బాలికలకు అవకాశం కల్పిస్తారు. వీరికి శిక్షణ అందించేందుకు బాలురు, బాలికలకు వేర్వేరుగా కోచ్‌లను నియమించనున్నారు. అదేవిధంగా వేర్వేరు వార్డెన్లతోపాటు గ్రౌండ్స్‌మెన్, స్వీపర్, సెక్యూరిటీ గార్డు సేవలను అందుబాటులోకి తీసుకురానున్నారు. మొత్తం ఎనిమిది సేవల నియామకానికి ప్రభుత్వం అనుమతించగా, ఔట్‌సోర్సింగ్ విధానంలో నియామకాలు చేపట్టనున్నారు.క్రీడాకారుల హర్షం...హుస్నాబాద్‌లో కబడ్డీ అకాడమీ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడంపై స్థానిక క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు. హుస్నాబాద్ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోచ్ కృష్ణ నేతృత్వంలో పీడీలు, పీఈటీలు, క్రీడాకారులు అంబేద్కర్ చౌరస్తాలో బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచుకున్నారు. అకాడమీ ఏర్పాటుకు కృషి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో కబడ్డీపై ఆసక్తి ఉన్న బాలబాలికలకు ఈ అకాడమీ ద్వారా శిక్షణ పొందే అవకాశం లభించనుంది. మెరుగైన శిక్షణ, వసతి సదుపాయాలతో క్రీడాకారులు తమ ప్రతిభను అభివృద్ధి చేసుకునేందుకు వీలుంటుందని స్థానిక క్రీడాభిమానులు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో పీడీ ఆర్.శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వి.వెంకటరమణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెన్న రాజు, పీఈటీలు అజయ్, వంశీ, సీనియర్ క్రీడాకారులు ఎస్.రాజేష్, సతీష్ వర్మ, సాయికృష్ణ, కత్తుల రఘు, అభినవ్, రాంచరణ్, అశ్వంత్, దిలీప్‌కుమార్, లాస్యశ్రీ, శాన్వి తదితరులు పాల్గొన్నారు.

TGTEL/26/A7716
ఉద్యమ పోరు
ప్రతి పదం పోరాట కదం
గురువారం 15.10.2026

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం

యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష

- టీఎస్ యుటిఎఫ్ జిల్లా కోశాధికారి డాక్టర్ జగన్నాథ్.
- మంచాల మండలం టీఎస్ యుటిఎఫ్ మండల అధ్యక్షులు డాక్టర్ అజ్మత్ ఖాన్.

ఉద్యమ పోరు, మంచాల, అక్టోబర్ 16 : మంచాల మండల పరిధిలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యా రంగ విధానాలను వ్యతిరేకిస్తూ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ టీఎస్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష నిర్వహించనున్నట్లు రంగారెడ్డి జిల్లా కోశాధికారి డాక్టర్ జగన్నాథ్ అన్నారు.ఈ దీక్ష 2026 అక్టోబర్ 17వ తేదీ శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు హైదరాబాద్‌లోని ధర్నా చౌక్, ఇందిరా పార్క్ వద్ద నిర్వహించబడుతుందని అన్నారు.ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన అన్నారు.ఉపాధ్యాయుల ఐక్యతే సమస్యల పరిష్కారానికి మార్గం అని ఆయన అన్నారు.

దిల్‌సుఖ్‌నగర్ కనకదుర్గా అమ్మవారిని దర్శించుకున్న

: ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

ఉద్యమ పోరు, దిల్‌సుఖ్‌నగర్, అక్టోబర్ 16 : దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎల్‌బీనగర్ శాసనసభ్యులు శ్రీ దేవిరెడ్డి సుధీర్ రెడ్డి దిల్‌సుఖ్‌నగర్‌లోని శ్రీ కనకదుర్గా అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ శ్రీ రాంచందర్, ఈఓ శ్రీమతి స్నేహలత, ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి గారికి ఘన స్వాగతం పలికి, అమ్మవారికి పూజా కార్యక్రమాలను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో చైతన్యపురి బిఆర్ఎస్ అధ్యక్షులు తోట మహేష్ యాదవ్, మధుసాగర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

లలితా త్రిపుర సుందరిగా అమ్మవారి దర్శనం..

- ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

- బుద్వేల్‌లో భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రి ఉత్సవాలు
- ఘనంగా కుంకుమార్చన, మహా చండీహోమం.. అన్నదానంతో ఆధ్యాత్మిక సందడి

ఉద్యమ పోరు, రాజేంద్రనగర్, అక్టోబర్ 16 : బుద్వేల్ రైల్వే స్టేషన్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహిస్తున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి.ఐదో రోజు అమ్మవారు లలితా త్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనమివ్వగా,ఆరో రోజు ప్రత్యేక పూజలు,మహా చండీహోమంతో ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.సాయంత్రం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.మరోవైపు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కుంకుమార్చన నిర్వహించారు.ఆరో రోజు వేదపండితుల ఆధ్వర్యంలో మహా చండీహోమం ఘనంగా నిర్వహించారు.పలువురు దంపతులు హోమంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పూల అనసూయ–సత్తయ్య ముదిరాజ్ జ్ఞాపకార్థం,పూల లావణ్య–వెంకటేష్ దంపతుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.ఈ వేడుకల్లో బస్తీ పెద్దలు,మహిళలు,యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.మాధవ రెడ్డి, సుధాకర్ గౌడ్,శ్రీను,రంగయ్య,సత్తయ్య,అనంత్ రెడ్డి,జంగయ్య,హన్మంత్,చిరంజీవి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ కోతలు ఎండిపోతున్న పంటలు

- ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి
- ఎల్ నీ నో కాదు కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం
- తెలంగాణను చీకట్లోకి నెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

ఉద్యమ పోరు, ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 16 : ఇబ్రహీంపట్నం పట్టణ కేంద్రంలో జిల్లా వ్యాప్తంగా కరెంట్ కోతలు విధించి రైతుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం - జిల్లాలో కరెంట్ కోతలు భయంకరంగా ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా రైతులు, ప్రజలు కరెంట్ కష్టాలతో అల్లాడిపోతున్నారు. పంటలు చేతికొచ్చే సమయంలో కరెంట్ లేక పంటలు ఎండిపోతున్నాయి. రైతులు నెలల తరబడి పెట్టిన పెట్టుబడి అంతా బూడిదపాలవుతోంది. కరెంట్ సరిగ్గా లేక మోటార్లు కాలిపోతున్నాయి, ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోతున్నాయి. వాటిని రిపేర్చేసేవారు లేక రైతులు తీవ్రఇబ్బందులు పడుతున్నా రు.పొలాలకు నీళ్లు పెట్టుకోవడానికి రైతులు అర్ధ రాత్రులు కూడా ఎదురుచూడాల్సిన పరిస్థితి వచ్చింది. ఎప్పుడు కరెంట్ వస్తుందో, ఎప్పు డు పోతుందో తెలియని దుస్థితి నెలకొంది. కొన్ని ప్రాంతాలలో ట్యాంకర్లతో పొలాలు తడపాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్ని ప్రాంతాల్లో నాలుగైదు గంటలు కూడా సక్రమంగా కరెంట్ వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుల పంటలు ఎండిపోతుంటే, పెట్టుబడులు నాశనమవుతుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కనీసం సోయి లేదు, స్పృహ లేదు, ముందస్తు ప్రణాళిక లేదు, సమస్యను పరిష్కరించాలనే చిత్తశుద్ధి లేదు. రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన ముఖ్యమంత్రి రాజకీయాలు చేసుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారు, రైతులకు కరెంట్ ఇవ్వలేని ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి అధికారంలో కొనసాగే నైతిక హక్కు ఏముంది?ఎల్ నినో కాదు.. - కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం!కరెంట్ కోతలన్నింటికీ ఎల్ నినో కారణమని, ప్రకృతి పరిస్థితుల వల్లే ఈ సమస్య వచ్చిందని ప్రజలను, రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. ఎల్ నినో ఉందని, వర్షాలు తగ్గాయని ముందే తెలిసినప్పుడు ప్రత్యామ్నాయ విద్యుత్ ఉత్పత్తికి ప్రణాళికలు సిదం చేసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానికి, ఈ ముఖ్యమంత్రికి లేదా? ప్రకృతి పరిస్థితులు ఎలా ఉన్నా ప్రజలకు, రైతులకు కరెంట్ అందించడానికి ముందస్తు ఏర్పాట్లు చేయాలి. కానీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆ పని చేయలేకపోయింది.కేసీఆర్ భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు ఎదురైనా తెలంగాణకు విద్యుత్ కొరత రాకూడదనే లక్ష్యంతో భద్రాద్రి, యాదాద్రి వంటి థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులను నిర్మించారు. వర్షాలు తగ్గినా,జలవిద్యుత్ ఉత్పత్తి పరిమితమైనా బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్ ద్వారా రాష్ట్ర అవసరాలను తీర్చాలనే ఆలోచనతో విద్యుత్ రంగాన్ని బలోపేతం చేశారు. మరి కేసీఆర్ గారు నిర్మించిన విద్యుత్ కేంద్రాలకు అవసరమైన బొగ్గును సరఫరా చేసుకోలేని పరిస్థితి ఎందుకు వచ్చింది? థర్మల్ విద్యుత్ కేంద్రాలు పూర్తి సామర్థ్యంతో పనిచేయడానికి అవసరమైన ఏర్పాట్లు ఎందుకు చేయలేదు? విద్యుత్ కేంద్రాలు ఉండి, ఉత్పత్తి సామర్థ్యం ఉండి కూడా కరెంట్ కోతలు ఎందుకు వస్తున్నాయి.దీనికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం సమాధానం చెప్పాలి.విద్యుత్ అధికారులను బలిచేసిముఖ్యమంత్రి తప్పించుకోలేరుకరెంట్ కోతలతో రాష్ట్రం అల్లాడుతుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పిపుచ్చు కోవడానికి విద్యుత్ అధికారులపై నెపం నెట్టే ప్రయత్నం చేస్తున్నారు. విద్యుత్ వ్యవస్థను నిర్వహించలేకపోయినా ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలి. అధికారులను సస్పెండ్ చేసినంతమాత్రాన రైతుల పొలాలకు కరెంట్ రాదు అనే విషయాన్ని ఈ రాష్ట్ర ప్రభుత్వం తెలుసుకోవాలి. అధికారులపై చర్యలు తీసుకోవడం ద్వారా ప్రజలకు ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారు.కేసీఆర్ హయాంలో ఇదే విద్యుత్ రంగంలో పనిచేసిన అధికారులు రాష్ట్రానికి విద్యుత్ సరఫరా చేయలేదా తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ నాయకత్వంలో విద్యుత్ రంగాన్ని బలోపేతం చేయడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని సుమారు 7,000 మెగావాట్ల స్థాయి నుంచి 20,000 మెగావాట్లకు పైగా పెంచింది. ఇకనయినా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం కళ్ళు తెరిచి వ్యవసాయానికి సక్రమంగా విద్యుత్ సరఫరా చేయాలి. కరెంట్ కోతల వల్ల పంటలు ఎండిపోతున్న రైతులకు తక్షణ సహాయం అందించాలి. లేని పక్షాన బీఆర్ఎస్ పార్టీ పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడుతుంది.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బతుకమ్మ సంబరాలు.

ఉద్యమ పోరు, ఏన్కూర్, అక్టోబర్ 16 : ఏన్కూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బతుకమ్మ సంబరాలు శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ బాలకృష్ణ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఆరోగ్య కేంద్ర ప్రాంగణంలో రంగురంగుల పూలతో తీరొక్క బతుకమ్మలతో అందంగా అలంకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలకృష్ణ మాట్లాడుతూ... తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు మహిళల ఆత్మ గౌరవానికి బతుకమ్మ పండుగ ప్రతీక అని కొనియాడారు. ప్రజల ఆరోగ్య రక్షణలో నిరంతరం శ్రమించే సిబ్బంది అంతా కలిసి ఇలాంటి సంప్రదాయా పండగను జరుపుకోవడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తోంది అని ఆయన పేర్కొన్నారు. వేడుకల్లో మహిళా సిబ్బంది సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మల చుట్టూ తిరుగుతూ చప్పట్లతో లయబద్ధమైన పాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది , నర్సింగ్ సిబ్బంది ,ఏఎన్ఎం లు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఆశా వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మూడుచింతలపల్లిలో ఘనంగా బతుకమ్మ సంబరాలు : చైర్మన్ జాము రవి

ఉద్యమ పోరు, శామీర్ పేట, అక్టోబర్ 16 : మూడుచింతలపల్లి మున్సిపల్ కార్యాలయ ఆవరణలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ జాము రవి అధ్యక్షతన, కమిషనర్ వెంకట గోపాల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆటపాటలతో సందడి చేశారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు.మహిళా సంఘాల సభ్యులు, ఆర్‌పీలు, ఓబీలు, మెప్మా సిబ్బంది, సాంస్కృతిక కళాకారులు సంప్రదాయ దుస్తుల్లో వేడుకల్లో పాల్గొన్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, వాటి చుట్టూ చేరి పాటలు పాడుతూ పండుగ శోభను తీసుకొచ్చారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన మహిళలను చైర్మన్ జాము రవి అభినందించి బహుమతులు అందజేశారు. మహిళలు ఐకమత్యంతో ముందుకు సాగుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలని ఆయన ఆకాంక్షించారు.కార్యక్రమంలో కౌన్సిలర్లు దోసకాయల లత, పెద్దిరెడ్డి శ్రీలత, కొల్లాస్ రాజు, ఆది అజయ్ కుమార్, ముద్దం పాపిరెడ్డి, మెరుపాటి గోవర్ధన్ రెడ్డి, పులి ప్రభాకర్, గూడ జంగారెడ్డి, నాయకులు ఇర్రి రవీందర్ రెడ్డి, బూరుగు యాదగిరి, భూమేష్ గౌడ్, మెప్మా టీఎంసీ నర్సింహ, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మోహన్ సింగ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర్ రెడ్డి, గౌతమి, మహిళా సంఘాల ప్రతినిధులు, ఆర్‌పీలు, ఓబీలు, సాంస్కృతిక కళాకారులు, మున్సిపల్ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

TGTEL/26/A7716
ఉద్యమ పోరు
ప్రతి పదం పోరాట కదం
గురువారం 15.10.2026

విమానాల మార్పులు,ఇంజినీరింగ్ సామర్థ్యాలను బలోపేతం చేసేందుకు జీఎంఆర్ ఏరో టెక్నిక్, లాజిక్ ఎయిర్ మధ్య అవగాహన ఒప్పందం

ఉద్యమ పోరు, రాజేంద్ర నగర్, అక్టోబర్ 16 : ప్రముఖ విమాన నిర్వహణ,మరమ్మతులు,సమగ్ర సాంకేతిక సేవల సంస్థ అయిన జీఎంఆర్ ఏరో టెక్నిక్,కెనడాకు చెందిన విమానాల మార్పులు,ధ్రువీకరణ,నిర్వహణ సంస్థ కార్పొరేషన్ లాజిక్ ఎయిర్ ఇంక్.తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది.భారతదేశంతో పాటు అంతర్జాతీయ మార్కెట్లలోని వినియోగదారులకు విమానాల మార్పులు,ఇంజినీరింగ్,ధ్రువీకరణ,కాలం చెల్లిన పరికరాలు,సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించిన పరిష్కారాలను అందించేందుకు ఈ రెండు సంస్థలు కలిసి పనిచేయనున్నాయి.ఈ భాగస్వామ్యం ద్వారా ముందస్తుగా ప్రణాళిక చేసిన నిర్వహణ కార్యక్రమాలు,విమానాలను తిరిగి అప్పగించే కార్యక్రమాలు,విమానాల మార్పిడి తనిఖీల సమయంలో సులభంగా అమలు చేయగల సమగ్ర విమాన మార్పుల పరిష్కారాలను అందించడంపై దృష్టి సారించనున్నాయి.భారతదేశం, అంతర్జాతీయ విమానయాన సంస్థల అవసరాలకు అనుగుణంగా,లాజిక్ ఎయిర్కు చెందిన అర్హత కలిగిన అదనపు రకం ధ్రువీకరణ పత్రాలు (ఎస్టీసీలు),విమానాల మార్పులకు సంబంధించిన సాంకేతిక సమాచారాన్ని ధ్రువీకరించడం,అనుకూలీకరించడం,విమానాల్లో అమలు చేయడం వంటి అంశాలను కూడా ఈ భాగస్వామ్యం పరిశీలిస్తుంది.ముఖ్యంగా మధ్యప్రాచ్యం,ఆసియా-పసిఫిక్ ప్రాంతాల్లోని అవకాశాలపై ప్రత్యేక దృష్టి సారించనుంది.అదనంగా,విమానయాన సంస్థలు,విమానాల లీజు సంస్థలు,సరుకు రవాణా విమానాల నిర్వహణ సంస్థలతో కలిసి అవకాశాలను అన్వేషించడంతో పాటు,భారతదేశంలో అమరిక,శిక్షణ,నిరంతర నిర్వహణ,విమాన సేవా జీవితకాలమంతా సాంకేతిక సహాయం అందించే సామర్థ్యాలను బలోపేతం చేయనున్నాయి.ప్రతి ప్రాజెక్టుకు సంబంధించిన వాణిజ్యపరమైన ఏర్పాట్లు ఆయా ప్రాజెక్టుల అవసరాలకు అనుగుణంగా రూపొందించబడతాయి.ఈ భాగస్వామ్యం గురించి జీఎంఆర్ ఏరో టెక్నిక్ అధ్యక్షుడు,బాధ్యతాయుత నిర్వాహకుడు అశోక్ గోపీనాథ్ మాట్లాడుతూ..ఈ అవగాహన ఒప్పందం ద్వారా పరస్పర పూరకమైన మా సంస్థల సామర్థ్యాలను ఒకచోట చేర్చుతున్నాం.తద్వారా మా వినియోగదారులకు,విస్తృత విమానయాన రంగానికి గణనీయమైన విలువను అందించగలమని ఆశిస్తున్నాం.లాజిక్ ఎయిర్కు ఉన్న విమానాల మార్పులు,ఇంజనీరింగ్,ధ్రువీకరణ నైపుణ్యాలను,జీఎంఆర్ ఏరో టెక్నిక్కు ఉన్న విమాన నిర్వహణ,మరమ్మతులు,సమగ్ర సాంకేతిక సేవల మౌలిక సదుపాయాలు,అమలు సామర్థ్యాలతో సమన్వయం చేయడం ద్వారా,నిర్వహణ,విమానాల మార్పిడి కార్యక్రమాలతో పాటు సమర్థవంతంగా అందించగల సమగ్ర పరిష్కారాలను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.ఈ భాగస్వామ్యం భారతదేశంతో పాటు అంతర్జాతీయ మార్కెట్లలోని వినియోగదారులకు,ముఖ్యంగా మధ్యప్రాచ్యం,ఆసియా-పసిఫిక్ ప్రాంతాల్లో సేవలందించే మా సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేస్తుంది"అని తెలిపారు.లాజిక్ ఎయిర్ ఇంక్.లో వ్యూహాత్మక ప్రణాళికలు,ప్రపంచవ్యాప్త వ్యాపార అభివృద్ధి విభాగం కార్యనిర్వాహక డైరెక్టర్ ప్రశాంత్ రాజన్న మాట్లాడుతూ..జీఎంఆర్ ఏరో టెక్నిక్తో మా భాగస్వామ్యం,కార్పొరేషన్ లాజిక్ ఎయిర్ ఇంక్.ప్రపంచవ్యాప్త విస్తరణ వ్యూహంలో ఒక ముఖ్యమైన మైలురాయి.కెనడా దేశపు విమాన,అంతరిక్ష సాంకేతిక రంగ ఆవిష్కరణలను అంతర్జాతీయ మార్కెట్లకు తీసుకెళ్లాలనే మా నిబద్ధతకు ఇది నిదర్శనం.కార్పొరేషన్ లాజిక్ ఎయిర్ ఇంక్.కు ఉన్న అదనపు రకం ధ్రువీకరణ పత్రాల (ఎస్టీసీలు) విస్తృత సమాహారం,విమాన ఎలక్ట్రానిక్

వ్యవస్థల ఆధునికీకరణ,విమానాల మార్పులు,ధ్రువీకరణలోని నైపుణ్యాలను,జీఎంఆర్ ఏరో టెక్నిక్కు ఉన్న స్థిరపడిన విమాన నిర్వహణ,మరమ్మతులు,సమగ్ర సాంకేతిక సేవల సామర్థ్యాలు,ప్రపంచవ్యాప్త వినియోగదారులకు చేరువయ్యే సామర్థ్యంతో సమన్వయం చేయడం ద్వారా, తక్కువ వ్యయంతో కూడిన సమగ్ర పరిష్కారాలను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.ఈ పరిష్కారాలు విమానాల నిర్వహణ జీవితకాలాన్ని పొడిగించడంతో పాటు,కాలం చెల్లిన పరికరాలు,సాంకేతిక పరిజ్ఞానం వల్ల ఎదురయ్యే సవాళ్లను పరిష్కరించి,విమానాల సముదాయ పనితీరును మెరుగుపరుస్తాయి.ఈ భాగస్వామ్యం ద్వారా కెనడా విమాన,అంతరిక్ష సాంకేతిక రంగ ఇంజనీరింగ్,ఆవిష్కరణలు భారతదేశం,మధ్యప్రాచ్యం,ఆసియా-పసిఫిక్ ప్రాంతాల్లో వేగంగా అభివృద్ధి చెందుతున్న విమానయాన మార్కెట్లకు సేవలందించేందుకు ఒక వ్యూహాత్మక వేదిక కూడా ఏర్పడుతుంది" అని పేర్కొన్నారు.ప్రారంభ దశలో భాగస్వామ్యానికి సంబంధించిన ప్రధాన రంగాల్లో బోయింగ్ 737 ఎన్జీ విమానాల నావిగేషన్,నిర్వహణ సంబంధిత ఆధునికీకరణలు,ఏటీఆర్,డాష్ 8 విమానాల్లో ఇంజిన్ సూచిక వ్యవస్థల ఆధునికీకరణ,క్యాబిన్ విద్యుత్ వ్యవస్థలు,నిర్మాణానికి సంబంధించిన మార్పులు..అదనపు డాష్ 8 క్యూ400 విమాన మార్పులు: సరుకు రవాణా విమానాలుగా మార్పిడి,విమానాల మార్పిడి సమయంలో సాంకేతిక సహాయం; కాలం చెల్లిన విడిభాగాలు,పరికరాలకు సంబంధించిన పరిష్కారాలు,విమానం రెక్కపై ఇంజిన్ అమర్చిన స్థితిలోనే అందించే సాంకేతిక సహాయం,అలాగే శిక్షణ,అంతర్జాతీయ మార్కెట్ల అభివృద్ధి వంటి అంశాలు ఉన్నాయి.ఈ భాగస్వామ్యం ద్వారా విమానాల సమగ్ర అనుసంధానం,ఇంజినీరింగ్,ధ్రువీకరణలో లాజిక్ ఎయిర్కు ఉన్న నైపుణ్యాలు,అదనపు రకం ధ్రువీకరణ పత్రాలకు (ఎస్టీసీలు) సంబంధించిన సాంకేతిక సమాచారం,వాటి వర్తింపు అంచనా,ధ్రువీకరణ,అనుమతుల ప్రణాళిక,అమరిక రూపకల్పన,పరీక్షలు,నిరంతర విమాన ప్రయాణ భద్రతకు సంబంధించిన సాంకేతిక సహాయ సామర్థ్యాలు,జీఎంఆర్ ఏరో టెక్నిక్కు ఉన్న విమాన నిర్వహణ,మరమ్మతులు,సమగ్ర సాంకేతిక సేవల మౌలిక సదుపాయాలు,అమరిక సామర్థ్యాలు,నియంత్రణ సంస్థల అనుమతులు,వినియోగదారులకు చేరువయ్యే విస్తృత నెట్వర్క్ సమన్వయం కానున్నాయి.ఈ భాగస్వామ్యం ద్వారా పెరుగుతున్న వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా సమగ్ర విమాన మార్పులు,ఇంజనీరింగ్ పరిష్కారాలను అందించే జీఎంఆర్ ఏరో టెక్నిక్ సామర్థ్యం మరింత పెరుగుతుందని అంచనా.అదే సమయంలో,ప్రపంచ విమానయాన అనంతర సేవల మార్కెట్లో ఇరు సంస్థలు తమ కార్యకలాపాలను విస్తరించేందుకు కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయి.

నవంబర్ 18న హలో కళాకారుడా.. ఛలో కరీంనగర్..

- సకల కళల కళాకారులచే ధర్నా కార్యక్రమం విజయవంతం చేయండి
- రాష్ట్రంలో జానపద విశ్వవిద్యాలయం జానపద అకాడమీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని వేడుకున్న
- వలస సుభాష్ చంద్రబోస్ రాష్ట్ర కన్వీనర్ సకల కళల జేఏసీ

ఉద్యమ పోరు, హుస్నాబాద్, అక్టోబర్ 16 : హుజురాబాద్ పట్టణంలో అంబేద్కర్ కూడలి వద్ద వచ్చే నెల నవంబర్ 18న కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద ఉమ్మడి కరీంనగర్ జిల్లా సకల కళల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ను సకల కళల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ ప్రముఖ సంఘ సేవకులు వలస సుభాష్ చంద్రబోస్ చేతుల మీదుగా ఆవిష్కరణ చేయడం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ మధ్యకాలంలో కళాకారుల కోసం ప్రత్యేకంగా కళాకారులకు గుర్తింపు కార్డు ఇవ్వడం ప్రభుత్వానికి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేస్తున్నట్టు ఆయన తెలిపారు వచ్చేనెల నవంబర్ 18న హలో కళాకారుడా చలో కరీంనగర్ అనే నినాదంతో సకల కళాకారులచే కళాకారుల సమస్యలపై ధర్నా కార్యక్రమం కరీంనగర్ లోని కలెక్టరేట్ వద్ద చేపడుతున్నట్లు ఆయన తెలిపారు ఈ కార్యక్రమానికి జిల్లాలోని అఖిలపక్ష పార్టీలను నాయకులను ప్రజా సంఘాలను జిల్లాలో ఉన్న కళాకారుల సంఘాలకు ఆహ్వానం తెలుపుతున్నట్టు ఆయన అన్నారు హుజరాబాద్ ప్రాంత సకల కళాకారులు ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు తెలంగాణ రాష్ట్ర ఏర్పడి 13 సంవత్సరాల అయినప్పటికీ రాష్ట్రంలో కల్చర్ పాలసీ లేకపోవడం బాధాకరమని ఆయన అన్నారు తెలంగాణ అంటేనే జానపదం జానపదాన్ని భావితరాల అందించేందుకు రాష్ట్రంలో జానపద విశ్వవిద్యాలయం జానపద అకాడమీ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నట్టు ఆయన తెలిపారు పెండింగ్ లో ఉన్న కళాకారుల పెన్షన్లను మంజూరు చేయాలని ఆయన అన్నారు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల వాగ్దానంలో మినీఫెస్టో పెట్టిన కళాకారుల సంక్షేమ కోసం పెట్టిన పథకాలు అమలు పరచాలని ఆయన ప్రియతమా రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డిని గారిని కోరుతున్నట్టు ఆయన అన్నారు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉన్న కళాకారులు మన కళాకారుల సమస్యలపై నవంబర్ 18న చేపడుతున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అని అన్నారు కరీంనగర్ జిల్లా అంటే కలలకు కానాచి జిల్లా ఎంతోమంది కళాకారులు తయారుచేసిన అంతర్జాతీయ స్థాయిలో కళా ప్రదర్శన చేసిన కళాకారుల పుట్టినిల్లు కరీంనగర్ జిల్లా కరీంనగర్ జిల్లా నుండి జానపద విశ్వవిద్యాలయం జానపద అకాడమీ ఏర్పాటు చేయాలని ప్రత్యేకంగా ఈ ధర్నా కార్యక్రమం చేపట్టబోతున్నట్టు ఆయన అన్నారు ఒక జాతి నిర్మాణానికి మూలం జానపదం అని ఆయన పేర్కొన్నారు అలాంటి సంస్కృతిని వారసత్వాన్ని రక్షించుకోవడం మనందరి బాధ్యతని ఆయన పేర్కొన్నారు పల్లె వాసుల గుండెచప్పుడు జానపదమని పేర్కొన్నారు జానపద సంస్కృతి జానపదాలు భావితరాలకు అందించేందుకు అందరం కృషి చేద్దామని వారు పేర్కొన్నారు రాష్ట్ర ప్రభుత్వం కళాకారుల సంక్షేమం కోసం కృషి చేయాలని ఆయన అన్నారు పెండింగ్ ఉన్న కళాకారుల పెన్షన్లను మంజూరు చేయాలని ఆయన కోరారు వారి వెంట పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా సకల కళల జేఏసీ జిల్లా చైర్మన్ బొజ్జ ఎల్లయ్య జిల్లా కన్వీనర్ ఐల ప్రసన్న ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు రుద్ర రామచంద్రం జిల్లా సకల కళల జేఏసీ జిల్లా కమిటీ సభ్యులు కుడికాల లక్ష్మి కళాకారులు మెరుగు లక్ష్మి హుజరాబాద్ మండల సీనియర్ కళాకారులు లంక సిరి రాజకుమార్ కుమార్ గజవెల్లి సమ్మయ్య తిరుపతి చేశారు

శ్రీ బాలాజీ సోలార్ ఇన్‌ఫ్రా గొప్ప ప్రారంభోత్సవం

- ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి

ఉద్యమ పోరు, ఉప్పల్ భాగయత్, అక్టోబర్ 16 : ఉప్పల్ భగాయత్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ బాలాజీ సోలార్ ఇన్‌ఫ్రా సంస్థ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు హాజరై సంస్థను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు సంస్థ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. సౌర విద్యుత్ రంగంలో నూతన అవకాశాలను అందిపుచ్చుకుంటూ, పర్యావరణ పరిరక్షణకు దోహదపడేలా సోలార్ ఎనర్జీ వినియోగాన్ని ప్రోత్సహించాలని ఆకాంక్షించారు.పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగం పెరగడం ద్వారా విద్యుత్ అవసరాలను తీర్చుకోవడంతో పాటు పర్యావరణానికి మేలు జరుగుతుందని పేర్కొన్నారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కంపెనీ డైరెక్టర్ శైలజ , వైష్ణవి, కృష్ణమూర్తి, స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పునరావాస కేంద్రంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

ఉద్యమ పోరు, శామీర్ పేట, అక్టోబర్ 16 : దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించి, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను చాటిచెప్పడమే లక్ష్యంగా బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు జిల్లా పంచాయతీరాజ్ అధికారి సాంబశివరావు తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో, అధికారుల సహకారంతో దివ్యాంగుల పునరావాస కేంద్రంలో బతుకమ్మ పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగులు ఉత్సాహంగా పాల్గొని పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయబద్ధంగా వేడుకలు జరుపుకున్నారు.రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మల చుట్టూ చేరి పాటలు పాడుతూ, ఆటపాటలతో సందడి చేశారు. దీంతో పునరావాస కేంద్రంలో పండుగ వాతావరణం నెలకొంది. దివ్యాంగులు కూడా సమాజంలోని సాంస్కృతిక, సంప్రదాయ వేడుకల్లో భాగస్వాములై ఆనందంగా గడిపేలా ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయి. వారిలో మానసిక ఉల్లాసం, ఆత్మస్థైర్యం పెంపొందించడంతోపాటు పరస్పర స్నేహభావాన్ని బలోపేతం చేయడానికి ఈ వేడుకలు ఉపయోగపడతాయి. దివ్యాంగుల సంక్షేమానికి, వారి అభ్యున్నతికి ప్రోత్సాహం అందించడం ఎంతో ముఖ్యమని నిర్వాహకులు పేర్కొన్నారు.జిల్లా పంచాయతీరాజ్ అధికారి సాంబశివరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో పునరావాస కేంద్రం సిబ్బంది, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ మహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారి

- బుద్వేల్‌లో వైభవంగా నవరాత్రి ఉత్సవాలు.. ప్రత్యేక పూజల్లో పాల్గొన్న సురేష్ దంపతులు

ఉద్యమ పోరు, రాజేంద్రనగర్, అక్టోబర్ 16 : బుద్వేల్ టీచర్స్ కాలనీలోని శ్రీశ్రీశ్రీ కట్టమైసమ్మ దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. 6వ రోజు అమ్మవారు శ్రీ మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమివ్వడంతో ఆలయంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు సురేష్ దంపతులు పూజా కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ మహాలక్ష్మీదేవి ఆశీస్సులతో అందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని భక్తులు ప్రార్థించారు.

పలు షాపుల ప్రారంభోత్సవాల్లో పాల్గొన్న : తుంగతుర్తి రవి

ఉద్యమ పోరు, మేడిపల్లి, అక్టోబర్ 16 : మేడిపల్లి డివిజన్, పీర్జాదిగూడ డివిజన్ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన పలు వ్యాపార సంస్థల ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి పాల్గొని,షాపులయజమానులకుశుభాకాంక్షలుతెలియజేశారు.ఈ సందర్భంగా శ్రీ శ్రీవాణి ఎంటర్ ప్రైజెస్, వెంకటేశ్వర ట్రేడర్స్, క్లాత్ వరల్డ్ షాపుల ప్రారంభోత్సవాల్లో పాల్గొని,వ్యాపారాలు విజయవంతంగా అభివృద్ధి చెందాలనిఆకాంక్షించారు.ఈసందర్భంగాతుంగతుర్తి రవి మాట్లాడుతూ.....స్థానికంగా నూతన వ్యాపార సంస్థలు ప్రారంభం కావడం వల్ల ప్రజలకు అవసరమైన వస్తువులు అందుబాటులోకి రావడంతో పాటు, స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. వ్యాపార రంగంలో ముందుకువస్తున్నవ్యాపారవేత్తలను ప్రోత్సహించాలని, ప్రతి ఒక్కరూ తమ వ్యాపారాల్లో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.ఈకార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పప్పుల అంజిరెడ్డి,ఐలయ్య యాదవ్, షోయబ్, నబీన్, శ్రీను, మల్లేష్, పంగ ధనరాజ్, శంసుద్దీన్ మరియు స్థానిక నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు,వివిధ పార్టీల నాయకులు,వ్యాపార సంస్థల యజమానులు, వారి కుటుంబ సభ్యులు, స్నేహితులు, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

ఉద్యమ పోరు, ఖమ్మం, అక్టోబర్ 16 : జడ్పీ సెంటర్ అంబేద్కర్ విగ్రహం వద్ద తెలంగాణ ఉద్యమకారుడు డాక్టర్ పిడమర్తి రవి పిలుపు మేరకు తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు . ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారును గుర్తించడానికి మరియు వాళ్ల పేర్లు నమోదు చేసుకోవడానికి వెబ్సైట్ ప్రక్రియను ప్రారంభించినందుకు ఉద్యమకారుల అందరి తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు . వెబ్సైట్ ప్రక్రియను వేగవంతం చేసి తెలంగాణ ఉద్యమ కారులను గుర్తించి 250 గజాల ఇంటి స్థలం , గుర్తింపు కార్డు , ఇంటి నిర్మాణం కోసం 10 లక్షల రూపాయలు , నేలకు 30 వేలు వేతనం ఇచ్చేలా చూడాలని కోరారు . ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ నాయకుడు మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు జిల్లా విజయ్ కుమార్ , తెలంగాణ ఉద్యమ జేఏసీ రాష్ట్ర నాయకులు మట్టి గురుమూర్తి , డాక్టర్ కె.వి కృష్ణారావు , కొరకప్ప రామారావు , మహేష్ , అరుణ , సరిత , సబిత , సురేష్ , నరేష్ తదితరులు పాల్గొన్నారు .

హైదరాబాద్‌లో బార్ల లైసెన్సులకు భారీ పోటీ..

- 14 స్థానాలకు 4,251 దరఖాస్తులు!

- రాష్ట్రవ్యాప్తంగా 41 బార్లకు 8,770 అప్లికేషన్లు
- నార్సింగిలో లాటరీ ద్వారా విజేతల ఎంపిక పూర్తి చేసిన ఎక్సైజ్ శాఖ.

ఉద్యమ పోరు, హైదరాబాద్ అక్టోబర్ 16 : తెలంగాణ రాజధాని హైదరాబాద్లో బార్ల లైసెన్సులకు వ్యాపారుల నుంచి అనూహ్య స్పందన లభించింది.ఎక్సైజ్ శాఖ పరిధిలోని కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ అవుట్లెట్లలో బార్ లైసెన్సుల దక్కించుకోవడానికి తీవ్ర పోటీ నెలకొంది. క్యూర్ పరిధిలోని కేవలం 14 బార్ల కేటాయింపు కోసం ఏకంగా 4,251 దరఖాస్తులు సమర్పించబడటాన్ని బట్టి ఇక్కడి డిమాండ్ను అర్థం చేసుకోవచ్చు. ప్రతి బార్ అవుట్లెట్కు సగటున 304 దరఖాస్తులు రావడం గమనార్హం.మొత్తం తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 41 కొత్త బార్ అవుట్లెట్ల కోసం ఎక్సైజ్ శాఖ దరఖాస్తులు ఆహ్వానించగా,ఏకంగా 8,770 అప్లికేషన్లు నమోదయ్యాయి.ఇందులో సింహభాగం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని క్యూర్ ప్రాంతానికే లభించాయి.క్యూర్ పరిధిలోని 14 బార్లకు 4,251 దరఖాస్తులు రాగా,రాష్ట్రంలోని మిగిలిన 27 అవుట్లెట్లకు 4,519 దరఖాస్తులు అందాయి.దరఖాస్తుల సంఖ్య ఊహించని రీతిలో పెరగడంతో ఎక్సైజ్ శాఖ అత్యంత పారదర్శకంగా లాటరీ విధానంలో డ్రా నిర్వహించింది.క్యూర్ పరిధిలోని 14 అవుట్లెట్లకు గాను నార్సింగిలో ఎక్సైజ్ కమిషనర్ సి.హరికిరణ్ పర్యవేక్షణలో లాటరీ డ్రా పూర్తి చేసి విజేతలను ప్రకటించారు.అలాగే,మిగిలిన 27 అవుట్లెట్లకు ఆయా జిల్లాల కలెక్టర్ల నేతృత్వంలో పారదర్శకంగా డ్రా ప్రక్రియను ముగించారు.

గురువే సన్మానించిన వేళ పరమానంద భరితుడైన శిష్యుడు

- నేనెంతో అదృష్టవంతుడిని సన్మాన గ్రహీత: కట్టెకోల

ఉద్యమ పోరు, ఖమ్మం, అక్టోబర్ 16 : స్థానిక ఎస్ఆర్అండ్ బిజిఎన్ ఆర్ డిగ్రీ కళాశాలలో ఆ కళాశాల పూర్వ విద్యార్థులు శుక్రవారం 2వ పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనం నిర్వహించారు. దాదాపు 70 ఏళ్ల క్రితం స్థాపించిన ఈ కళాశాల నుండి ప్రతి ఏటా వేలాదిమంది విద్యార్థులు డిగ్రీ పట్టాలు పుచ్చుకొని దేశంలోని ఇతర ప్రాంతాలతో పాటు ఇతర దేశాలలో ఉద్యోగాలు పొంది తమ జీవనోపాధి కొనసాగిస్తున్నారు. మరి కొంతమంది విద్యార్థులు రాజకీయ రంగంలోనూ విప్లవోద్యమాలలో భాగస్వామ్యం అవుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు నల్లమోతు తిరుమలరావు అధ్యక్షతన నిర్వహించిన పూర్వ విద్యార్థుల ద్వితీయ మహా సమ్మేళనంలో అనేక రంగాలలో ప్రతిభ కనపరిచిన పూర్వ విద్యార్థులను ఆ సంఘం సన్మానించింది. జర్నలిస్ట్ వృత్తిలో అత్యంత ప్రతిభ కనబరిచిన సీనియర్ జర్నలిస్ట్, ప్రముఖ కవి కట్టెకోల చిన నరసయ్యను సమ్మేళనం సభలో కార్యవర్గం సత్కరించింది. ఈ కార్యక్రమానికి హాజరైన నరసయ్య గురువు శేషయ్య సారు నేలకొండపల్లి మండలం బోదులబండ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1970 సంవత్సరంలో ఉపాధ్యాయుడిగా పని చేశారు. అప్పట్లో కట్టెకోల చిన నరసయ్య ఆ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నారు. శేషయ్య సార్ కు నరసయ్య ప్రియ శిష్యుడు. అయితే శేషయ్య సారు నరసయ్య ఇరువురు ఎస్ ఆర్ అండ్ బి జి ఎన్ ఆర్ కళాశాలలో చదివిన విద్యార్థులు. ఈ సమ్మేళన కార్యక్రమానికి హాజరైన శేషయ్య సార్ స్వయంగా నరసయ్యకు శాలువా కప్పి మెమెంటో అందజేసి సత్కరించటంతో నరసయ్య ఆనందంతో ఉద్వేగ భరితుడై సారుకు పాదాభివందనం చేశారు. గురు శిష్యులు ఒకే కళాశాలలో చదివిన వారై ఒకే వేదికపై కలుసుకోవడం పైగా గురువు శిష్యుడికి సన్మానం చేయడంతో పలువురు వారిని అభినందించారు.నేనెంతో అదృష్టవంతుడిని స్వయంగా తన గురువే తనకు సన్మానం చేయడంతో ఆ శిష్యుడు ఆనందం అంతా ఇంత కాదు. ఎస్ ఆర్ అండ్ బి జి ఎన్ ఆర్ కళాశాలలో ఆ కళాశాల పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనంలో కట్టెకోల చిన నరసయ్యను తన చిన్ననాటి గురువైన శేషయ్య సారు వేదికపై వచ్చి సన్మానించడంతో నరసయ్య ఆనందంలో మునిగిపోయాడు. స్వయంగా తన గురువే తనకు సన్మానం చేయడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని నేనెంతో భాగ్యవంతుడనని ఈ సందర్భంగా సన్మాన గ్రహీత విలేకరులకు తెలిపారు.

జూలూరుపాడు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి

- గోదారి జలాలతో చెరువులు, కుంటలు నింపాలి
- తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు చంద్ర నరేంద్ర కుమార్

ఉద్యమ పోరు, ఖమ్మం /జూలూరుపాడు, అక్టోబర్ 16 : ఎల్నినో ప్రభావంతో ఏర్పడిన తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతాంగాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షులు చంద్ర నరేంద్ర కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఐ మండల కార్యవర్గ సమావేశం సిరిపురపు వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే రైతులు వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టారని దిగుబడి చేతికి వచ్చే పరిస్థితి లేదని ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు. గోదావరి జలాలతో చెరువులను నింపాలని, రైతులకు కరువు పరిహారం తక్షణమే ఇవ్వాలని . కోరారు రాష్ట్రంలో లోటు వర్షపాతం నమోదైన జిల్లాల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఒకటని అనేక మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని ఆయన తెలిపారు. తక్షణం కరువు ప్రాంతంగా ప్రకటించి ఒక్కో ఎకరానికి పరిహారంగా రూ.30 వేలు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎల్ నినో ప్రభావం కారణంగా వర్షాలు లేకపోవడంతో చెరువులు, కుంటలు అడుగంటాయని భూగర్భ జల నీటిమట్టం కనిష్ట స్థాయికి చేరుకుంటుందన్నారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడంలో విఫలమైందని కనీసం చేతికి అందిన పంటలనైనా కాపాడేందుకు ప్రయత్నం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లాలో గోదావరి జలాలను అందించే ప్రక్రియను తక్షణం పూర్తి చేయాలని ప్రస్తుత పరిస్థితుల్లో సాధ్యమైనంత మేరకు గోదావరి జలాలతో చెరువులు, కుంటలను నింపాలని ఆయన డిమాండ్ చేశారు.పొరుగురాష్ట్రాలు ఇప్పటికే కరువు ప్రాంతాలుగా ప్రకటించి రైతాంగాన్ని ఆదుకునేందుకు చర్యలు చేపట్టాయని కానీ తెలంగాణ ప్రభుత్వం మాత్రం ఆ దిశగా ఆలోచన చేయడం లేదని విమర్శించారు పత్తికి కనీస మద్దతు ధర 13000 ఇవ్వాలని కోరారు ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం ఇవ్వాలని లేనిపక్షంలో పేద ఎత్తున రైతులను సమీకరించి ఆందోళన చేస్తామని హెచ్చరించారు ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి గుండె పిన్ని వెంకటేశ్వర్లు,sk నాగుల్ మీరా. ఎల్లంకి మధు. పోనేకంటి వెంకటేశ్వర్లు. గుండె పిన్ని మధు సుధన్ రావు, కంచర్ల రాఘవేంద్రరావు వల మల్ల సామేలు హాలవత్ బద్రు. కొండ వీరయ్య తదితరులు పాల్గొన్నారు

ఆర్టీసీ ఎన్నికల్లో ఇబ్రహీంపట్నం డిపో ఘనవిజయం

- ఇబ్రహీంపట్నం డిపో నియోజకవర్గం ఆర్టీసీ కార్మికుల కృషి
- డిపో గౌరవ అధ్యక్షుడు రాచర్ల వెంకటేశ్వర్లుల నాయకత్వం
- ఇబ్రహీంపట్నం శాసన సభ్యులు మల్రెడ్డి రంగారెడ్డి రాచర్లకి సన్మానం

ఉద్యమ పోరు, ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 16 : ఇటీవల జరిగిన ఆర్టీసీ ఎన్నికల్లో గెలుపొందిన టి డబ్ల్యూ, ఎస్ డబ్ల్యూ యూనియన్ నాయకులు ఇబ్రహీంపట్నం డిపో గౌరవాధ్యక్షులు మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డిని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా మల్లారెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ, ఆర్టీసీ కార్మికుల పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లవేళలా సేవలందిస్తుందని కాంగ్రెస్ ప్రభుత్వంలో భాగస్వామ్యంగా ఉన్న ఆర్టీసీ యూనియన్లు టిడబ్ల్యూ, ఎస్ డబ్ల్యూ యూనియన్ల కృషి ఫలితంగా మన ఇబ్రహీంపట్నం డిపోలో మన యూనియన్ గెలవడం ఎంతో సంతోషంగా ఉంది అన్నారు. ఆర్టీసీ కార్మికులకు ఇలాంటి సమస్యలు ఉన్న ఇబ్బందులు ఉన్న ప్రభుత్వంతో మాట్లాడి మన ఇబ్రహీంపట్నంలో బస్సు సౌకర్యం లేని గ్రామాలకు కూడా బస్సును అందించే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. మన ఇబ్రహీంపట్నం డిపోలో ప్రభుత్వంలో భాగస్వామ్యమైన యూనియన్లు గెలవడం అది కూడా మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్ల నాయకత్వంలో మన యూనియన్ ఘనవిజయం సాధించడం ఎంతగానో గుర్తుంచుకోవాల్సిన విషయమని ఆయన గుర్తు చేశారు. అదేవిధంగా రాచర్ల మాట్లాడుతూ, ఆర్టీసీ కార్మికుల ను ప్రభుత్వం ఆదుకునే విధంగా మల్రెడ్డి రంగారెడ్డి మన స్థానిక ఎమ్మెల్యే సహకారంతో కార్మికులకు ఎలాంటి ఆపద వచ్చిన ఎలాంటి ఇబ్బంది వచ్చిన ప్రభుత్వం ఆదుకునే దిశగా, అండగా ఉంటుందని ఈ గెలుపు ఆశ మాస కాదు కార్మికుల యొక్క కష్టార్జితమై మన ఇబ్రహీంపట్నంని మన యూనియన్ లో గెలుచుకోవడం జరిగింది అన్నారు.

Printed, Published and Owned by Bandari Srujana, on behalf of Sri Venkateswara Printing Solutions, Editor - Bandari Sumanth, is responsible for news selection under PRB act
prgi.gov.in RNI.TGTEL/26/A7716, # 19-212/3-3A, Narsampet, Warangal, Telangana, India - 506132, Cell : 7569337969 Email:udyamaporu@gmail.com